
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 01.01.2016, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 31 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com





## అధినేతల తీరు మారితే...

# ఆంధ్రుల రాత మారుతుంది!

### ➤ క్యాలెండర్ మారింది... క్యారెక్టర్‌లు మారేనా?

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రకు సంబంధించి 2014, 2015... రెండు సంవత్సరాలు కూడా చీకటి జ్ఞాపకాలనే మిగిల్చాయి. 2014లో సమైక్య రాష్ట్రం రెండు ముక్కలైంది. సవాలక్ష సమస్యలతో ఆంధ్రప్రదేశ్ నడిరోడ్డు మీద నిలబడింది. విభజన తర్వాత ఏపి పరిస్థితి ఏ మాత్రం మెరుగుపడలేదు. ఆర్థిక సమస్యలన్నీ అలాగే వున్నాయి. రాజధాని లేని రాష్ట్రంలో పరిపాలన ఎంత దరిద్రంగా ఉంటుందో ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాము. విభజన సమయంలో ఏపికిచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయడం లేదు. ఏపి పట్ల కేంద్రం సహాయనిరాకరణోద్యమం చేస్తున్నట్లుగా వుంది. ఏపికిస్తామన్న ప్రాజెక్టుల విషయంలో పెద్దగా కదలిక లేదు.**

అన్నింటికంటే ముఖ్యమైంది రాష్ట్రానికి ప్రత్యేకహోదా. పార్లమెంటులో కాంగ్రెస్, బీజేపీ వంటి జాతీయ పార్టీలు ఇచ్చిన హామీ ఇది. ఇప్పుడు కేంద్రం దీనిపై మాట మారుస్తోంది. నిబంధనలు ఒప్పుకోవంటోంది. రాజధాని నిర్మాణం చేసుకుంటున్నామని చంద్రబాబు శంకుస్థాపన చేస్తుంటే ప్రధాని నరేంద్రమోడీ వచ్చి ఢిల్లీ నుండి తెచ్చిన మట్టి, నీళ్లు అందించి వెళ్లాడు. రాష్ట్ర ఆర్థిక స్థితి అంతంత మాత్రంగా వుంది. రాజధాని కట్టుకోవడంతో పాటు సంక్షేమ పథకాలను అమలు చేసుకుంటూపోవాలి. ఋణమాఫీ వంటి ఆర్థిక భారమైన హామీలను అమలు చేయాలి. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ స్తబ్దుగా వుంది. తగినన్ని నిధులు లేవు. పథకాలు, ప్రాజెక్టులు అమలు చేయడానికి నిధులు కొరత వెంటాడుతోంది. స్థూలంగా చూస్తే ఇదే రాష్ట్ర పరిస్థితి.

అయితే సమస్యలెన్నో వున్నా సమర్ధవంతమైన ప్రభుత్వం, అధికార పార్టీ తప్పు చేస్తే చీల్చి చెండాడే ప్రతిపక్షం రాష్ట్రంలో వుంటే ఇలాంటి సమస్యలన్నింటిని కూడా అధిగమించడం పెద్ద సమస్యేమీ కాదు. అయితే మన దురదృష్టం కొద్దీ రెండూ కూడా అలాంటివి లేవు. రాష్ట్రంలో ప్రభుత్వం ఒక ప్రైవేట్ కంపెనీలాగా నడుస్తోంది. పరిపాలనలో ఒక పద్ధతి, పాడూ లేదు. ప్రతిదీ వక్రమార్గమే. అమరావతి రాజధాని ఎంపికే రాంగ్. పచ్చటి పైర్లు పండే పొలాలను కాంక్రీట్ జంగిల్‌గా మార్చాలనుకుంటున్నారు. రాజధాని వ్యవహారమంతా కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారంలానే వుంది. రైతుల కడుపుకొట్టి విలువైన భూములను సింగపూర్ కంపెనీల పేరుతో కబ్జా చేసే ప్రక్రియ విజయవంతంగా జరుగుతోంది. ఆలూ లేదు చూలూ లేదు అల్లుడి పేరు సోమలింగం అన్నట్లు సింగపూర్ కంపెనీలు ఇచ్చే మాస్టర్ ప్లాన్‌లను చూపిస్తూ ఎల్లో మీడియా 'అహో అమరావతి' అంటూ బాకా వూదుతోంది. ఈ రాజధాని వల్ల భవిష్యత్‌లో అక్కడి రైతులకు జరిగే నష్టాన్ని ఎవరూ తలకెక్కించుకోవడం లేదు. ఇక అధికారుల బదిలీలను మొదలుకొని ఇసుక మాఫియా, ఇరిగేషన్ పనులు... సెజ్‌ల కేటాయింపులు, భూసేకరణ వంటివన్నీ కూడా వ్యాపార కోణంలోనే జరుగుతున్నాయి. ప్రజాప్రతినిధులుగా గెలిచింది దోచుకోవడానికే అన్నట్లుగా అధికారపార్టీ నాయకుల వ్యవహార శైలి వుంది. గతంలో పారదర్శక పాలనతో, అంతో ఇంతో నిజాయితీ పరుడిగా పేరు తెచ్చుకున్న చంద్రబాబు ఈ దఫా మాత్రం ఒంటికంతా అవినీతి మలినాన్ని అంటించుకున్నాడు.

(మిగతా 11వ పేజీలో)




### » సభా సంస్కారానికి తిలోదకాలు...

# సొంత వ్యవహారాల్లా... అసెంబ్లీ వ్యవహారాలు!





**శాసనసభ అంటే రాజ్యాంగానికి దేవాలయం. అందులో జరిగే సమావేశాలు ఎంతగా గబ్బు పట్టినా, అసెంబ్లీ పరంగా కొన్ని సాంప్రదాయాలుంటాయి. వాటిని పరిరక్షించడం అందరి బాధ్యత! అసెంబ్లీ సాంప్రదాయాల పరిరక్షణలో ప్రధాన పాత్ర స్పీకర్‌ది. స్పీకర్ అధికారపక్షానికి చెందిన వారై ఉండొచ్చు. అయితే కొన్ని విధాన నిర్ణయాలను రాజకీయాలకతీతంగా తీసుకోవాలి. సభా మర్యాద అంతా కూడా స్పీకర్ వ్యవహారశైలి మీదే ఆధారపడి ఉంటుంది.**

మొన్న జరిగిన శీతాకాల అసెంబ్లీ సమావేశాలను చూసినవాళ్లెవరికైనా ఇది అసెంబ్లీనా లేక నెల్లూరు చేపల మార్కెట్టా అనే అనుమానం రాక మానదు. ఆ స్థాయిలో జరిగాయి సమావేశాలు. సభ్యుల నోట సంస్కారవంతమైన మాటలే లేవు. వీళ్ల భాషను వింటే... వీళ్లకన్నా బెల్టుషాపుల వద్ద మందు తాగేవాళ్లు నయమనిపిస్తోంది. మొన్నటి అసెంబ్లీ సమావేశాల్లో రోజాతో పాటు చాలామంది సభ్యుల నోట వాడరాని పదాలొచ్చాయి. ఇందులో ఇరు పార్టీ సభ్యుల పాత్ర వుంది.

ఇంతవరకు బాగానే వుంది. కేవలం వైసిపి సభ్యులు వున్న దృశ్యాలనే చూపిస్తూ ప్రభుత్వ చీఫ్‌విప్ కాల్వ శ్రీనివాసులు సిడిలు విడుదల చేయడం, అసెంబ్లీ స్పీకర్ అనుమతితోనే ఈ సిడిలను విడుదల చేసామని చెప్పడం వివాదాస్పదమైంది. ఆ పక్కరోజే సిడిల విడుదలకు తాను అనుమతినివ్వలేదని స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు పేర్కొన్నారు. అంటే అసెంబ్లీని సైతం ప్రైవేట్ కార్యాలయంగా మార్చేసారన్న మాట. అసెంబ్లీలో సైతం ఒక పద్ధతి లేకుండా పోయింది. స్పీకర్‌తో పని లేకుండానే అక్కడి వ్యవహారాలు నడుస్తున్నాయి.

అసెంబ్లీ సాంప్రదాయాలను మంట గలిపే ఇలాంటి చర్యలను ఏ పార్టీ వాళ్లు కూడా సమర్ధించకూడదు. తన కంట్రోల్‌లో ఉండాల్సిన అసెంబ్లీ వ్యవహారాలు ఇలా దారి తప్పుతుంటే స్పీకర్ ఉపేక్షించకూడదు. ఇలాంటి పోకడలు ముదిరితే ప్రజాస్వామ్య వ్యవస్థకే చేటు కలుగుతుంది.



# రూ.350 కోట్లతో ఎస్ఎస్ కెనాల్



## - రాష్ట్ర మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి

నెల్లూరుజిల్లా వెంకటగిరి మండలం సిసి కండ్రిగ సమీపంలో నిర్వహిస్తున్న ఎస్ఎస్ కెనాల్ పనులను రాష్ట్ర అటవీశాఖమంత్రి బొజ్జల గోపాలకృష్ణ పరిశీలించి మాట్లాడుతూ రూ.350కోట్లతో ఎస్ఎస్కెనాల్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. స్వర్ణముఖి, సోమశిల లింక్ కెనాల్ను 2016 నవంబర్ నాటికి పూర్తి చేసి నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని పలు ప్రాంతాలకు సాగు, తాగునీరు అందిస్తామన్నారు. సోమవారం మంత్రి కండలేరు అతిథి గృహంలో తెలుగుగంగ, అటవీశాఖ అధికారులతో సమీక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ డక్కిలి మండలం ఆల్తూరుపాడు వద్ద 4.25 టిఎంసీల నీటిని నిల్వచేసేలా ఎస్ఎస్ కెనాల్కు అనుబంధంగా రిజర్వాయర్ను నిర్మిస్తామన్నారు. కెనాల్ నిర్మాణం పూర్తయితే 10వేల ఎకరాలకు సాగునీరందించవచ్చన్నారు. రైతులు స్వచ్ఛంధంగా భూమిలిచ్చి కెనాల్ నిర్మాణానికి సహకరించాలన్నారు. సిసి కండ్రిగ వద్ద 700ఎకరాల అటవీ భూముల్లో వనసంరక్షణ సమితి ఏర్పాటు చేసి రైతులను భాగస్వాములు చేస్తామన్నారు. కండలేరు జలాశయం మట్టికట్టపై సిమెంటురోడ్డు నిర్మాణం చేపట్టి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, డిఎఫ్ఓ రామకృష్ణ, తెలుగుగంగ ప్రాజెక్ట్ సిఇ సుధాకర్, కోటేశ్వరరావు, శారద, ప్రసాద్నాయుడు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

# కనుమరుగైపోతున్న కళలు

## - బతికించుకోవాలని ఎమ్మెల్యే కిలివేటి పిలుపు



నేటి ఆధునిక ప్రపంచంలో రానురాను జీవితాలు యాంత్రికమైపోతున్నాయని, కళలు కనుమరుగైపోతున్నాయని.. ఈ నేపథ్యంలో కళలను బతికించుకోవాల్సిన బాధ్యత అందరిపై వుందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పిలుపునిచ్చారు. ఆదివారం సూళ్ళూరుపేటలో నిర్వహించిన జాతీయస్థాయి చిత్రకళా పోటీల బహుమతి ప్రదానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. అమ్మ ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో, పట్టణంలోని చాంఫియన్ పాఠశాలలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలివేటి మాట్లాడుతూ, ఇలాంటి పోటీలు చిత్రకారులకు ఎంతో స్ఫూర్తిదాయకంగా వుంటాయన్నారు. నిర్వాహకులను ఆయన అభినందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన చిత్రాలను తిలకించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో సూళ్ళూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన సి.సాయికృష్ణ (7వ తరగతి) ప్రథమ బహుమతిని సాధించి బంగారు పతకం కైవశం చేసుకోగా, చాంఫియన్ స్కూల్ విద్యార్థిని వై.లక్ష్మీప్రియ ద్వితీయ బహుమతిని సాధించింది. ఈ చిన్నారికి రెండువేల రూపాయలను నగదు బహుమతిగా ఇచ్చారు. అదేవిధంగా, తృతీయ బహుమతిని సాధించిన ఏకొల్లు హైస్కూల్ విద్యార్థి ఎం.వెంకటచైతన్యకు వెయ్యి రూపాయలు బహుమతిగా అందజేశారు. చిత్రాలను బాగా వేసిన మరో వందమందికి ప్రోత్సాహక బహుమతులను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్రెడ్డి, చాంఫియన్ చంద్రారెడ్డి, ఎంఇఓ శిరసనంబేటి చంద్రశేఖరరెడ్డి, కటారి ఉదయ్కుమార్, మునిసిపల్ ఫ్లోర్లీడర్ ముత్తుకూరు లక్ష్మమ్మతో పాటు పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# పొదలకూరుకు నాలుగులైన్ల రోడ్డు

నెల్లూరు నుంచి పొదలకూరు మీదుగా సైదాపురం వరకు నాలుగులైన్ల రోడ్డు నిర్మాణానికి సర్వే పనులు జరుగుతున్నాయి. హైదరాబాద్కు చెందిన కన్సల్టెన్సీ కంపెనీ తమిళనాడుకు చెందిన ఇంజనీర్ల ద్వారా రోడ్డు నిర్మాణానికి సంబంధించి సర్వే పనులను చేయిస్తున్నారు. నెల్లూరు నుంచి పొదలకూరు మీదుగా సైదాపురం వరకు 58కిలోమీటర్ల దూరం వుంది. ఈ మార్గం నాలుగులైన్లు అయితే పొదలకూరు పట్టణంలో రోడ్లు విశాలంగా తయారవుతాయి. ఇప్పటికే నెల్లూరు నుంచి పొదలకూరు వరకు, పొదలకూరు నుంచి సైదాపురం మార్గం దేగపూడి వరకు డబుల్రోడ్డు నిర్మించారు. గూడూరు నుంచి కడపజిల్లా రాజంపేట వరకు(ఘాట్రోడ్డు మీదుగా) నాలుగులైన్ల రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ఈ మార్గం సైదాపురం మీదుగా రాపూరు వరకు అక్కడి నుంచి రాజంపేటకు వెళుతుంది. నెల్లూరు నుంచి పొదలకూరు మీదుగా సైదాపురం వరకు నాలుగులైన్ల రోడ్డు నిర్మాణం చేపడితే అక్కడి నుంచి రాజంపేట వెళ్లేందుకు సులువవుతుందని అధికారులు భావిస్తున్నారు.

# 'ఎర్ర దొ(దు)ంగ'లను పట్టుకున్న పోలీసులు

నెల్లూరుజిల్లా చిల్లకూరు మండలంలోని పున్నపువారిపాళెంలో ఇతర ప్రాంతాల నుంచి ఎర్రచందనం దుంగలను తెచ్చి ఇక్కడ డంప్ చేసి తరలిస్తున్నారు. రవాణాకు సిద్ధం చేసిన 34ఎర్రచందనం దుంగలను ఆరు మంది స్మగ్లర్లను ఎస్సై అంకమ్మ సిబ్బందితో కలిసి ఇటీవల చాకచక్యంగా పట్టుకున్నారు. ఈమేరకు గూడూరు డిఎస్పీ శ్రీనివాస్ చిల్లకూరు పోలీస్స్టేషన్లో వివరాలు వెల్లడించారు. పున్నపువారి పాళెం సమీపంలోని అటవీ శివారు ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై తన సిబ్బంది కాపు కాసి పట్టుకున్నట్లు తెలిపారు. చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తి మండలం కొత్తపల్లిగుంటకు చెందిన చంద్రగిరి వినాయక్ బడా ఎర్రచందనం స్మగ్లర్ అని తెలిపారు. అతనికి తెలిసిన అదే ప్రాంతానికి చెందిన బండారు లక్ష్మయ్యతో, తొట్టంబేడు మండలం కాసవరం గ్రామానికి చెందిన కాసరం రత్నం, మదనపల్లిలోని తట్టువారిపల్లెకు చెందిన సయ్యద్ జమీర్, గూడూరు సత్రపువీధికి చెందిన గోపరాజు విజయకుమార్, పున్నపువారిపాళెంకు చెందిన అన్నంగి లీలాకుమార్లు కొంతకాలంగా నెల్లూరు, చిత్తూరు, కడపజిల్లా ప్రాంతాల నుంచి ఎర్రచందనం అక్రమంగా తరలిస్తుండేవారన్నారు. ఈ క్రమంలోనే రైల్వేకోడూరు సమీపంలోని మాముండూరు అడవుల్లో ఎర్రచందనం చెట్లను నరికి పున్నపువారిపాళెం వద్ద డంపింగ్ చేశారన్నారు. ఈమేరకు సమాచారం రావడంతో డంపింగ్ చేసిన స్థావరాన్ని గుర్తించి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఎర్రచందనం దుంగలను, 6మంది స్మగ్లర్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఏడు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన దుంగల విలువ దాదాపు రూ.9లక్షలు వరకు ఉంటుందన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపరచిన హెడ్కానిస్టేబుళ్లు రామేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు నరేంద్ర, సాయినాథ్, సురేష్లను డీఎస్పీ అభినందించారు. జిల్లా ఎస్పీ గజరావు భూపాల్ వారికి రివార్డులు ప్రకటించారు.

# ఆ చిరుత వణికిస్తోంది

నెల్లూరుజిల్లా ఉదయగిరి కొండ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తూ పట్టణవాసులతో పాటు కొండ కింద పల్లెల ప్రజలను వణికిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఆరునెలల వ్యవధిలో రెండుసార్లు చిరుత మేకల మందలపై దాడిచేసి జీవాలను పొట్టన పెట్టుకుంది. ఇటీవల దుర్గంపల్లి సమీపంలో ఏడు మేకలను హతమార్చడంతో గ్రామ ప్రజలు హడలిపోతున్నారు. అటవీశాఖ అధికారులు కూడా చిరుత సంచరిస్తుందన్న విషయాన్ని ధృవీకరిస్తున్నారు. ఇరవై, ముప్పై ఏళ్ల క్రిందట ఈ కొండ ప్రాంతంలో చిరుతలు తిరిగేవని, పదేళ్ల నుంచి ఇక్కడ పులులు నివాసం వుంటున్న దాఖలాలు లేవని స్థానికులు అంటున్నారు. ఉదయగిరి పట్టణాన్ని ఆనుకుని వున్న ఈ కొండపైకి పలు గ్రామాల ప్రజలతో పాటు పట్టణవాసులు కట్టెల కోసం వెళుతుంటారు. విహారయాత్రకని చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, యువకులు వస్తుంటారు. చిరుత సంచరిస్తుందన్న వార్త రావడంతో అటు ప్రక్కకి వెళ్ళేందుకు ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.








10వ వర్ధంతి



కీ॥శే॥ బొల్లినేని వెంకమ్మ గారు
మాముడూరు, చేజర్ల (మం)
జననం : 1-7-1922 మరణం : 26-12-2005

న ప్రహృష్యేత్ ప్రియం ప్రాప్య నోద్విజేత్ ప్రాప్య చాప్రియమ్ ।
స్థిరబుద్ధిరసంమూఢో బ్రహ్మవిద్బ్రహ్మణి స్థిత: ॥ 20 ॥

తాత్పర్యము-ప్రియలాభములకు పొంగిపోనివాడును, అప్రియములు ఎదురైనప్పుడు క్రుంగి పోనివాడును, స్థిరమైన బుద్ధి కలవాడును. మోహవివశుడు కాని వాడును అయిన బ్రహ్మవేత్త సచ్చిదానందఘనపరబ్రహ్మపరమాత్మ యందు సదా ఏకీభావస్థితుడైయుండును.

ఎందరికో చేయూతగా, సహాయకారిగా, ఆత్మీయురాలిగా ఎన్నో జీవితాలలో వెలుగునింపిన
'మహా మనీషి' కీ॥ శే॥ బొల్లినేని వెంకమ్మ గారి
10వ వర్ధంతి సందర్భంగా హృదయపూర్వకంగా స్మరించుకుంటూ...
వారి పవిత్రాత్మకు శాంతిని ప్రసాదించమని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు:
బొల్లినేని క్రిష్ణయ్య (ME. ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే)
బొల్లినేని శీనయ్య (MSc.,Ag.)
డా॥ బొల్లినేని భాస్కరరావు (M.S.,DNB. CT Surgeon)

కోడళ్ళు:
సుజాత
యమున
రాజశ్రీ

మనుమలు -
అర్జున్
సందీప్ - హారిక
రమణవేద్, ప్రద (మునిమనుమడు, మునిమనుమరాలు)
డా॥ అభినయ్ - డా॥ శ్వేత
ఆద్విక్

మనుమరాళ్ళు
ఐశ్వర్య - వెంకట్రామ్‌చౌదరి
ఆద్య, అర్పిత (మునిమనమరాళ్ళు)
డా॥ హరిణి - డా॥ అశోక్
మేఘవందిత్ (మునిమనుమడు)

కుమార్తెలు:
తాళ్లూరు లలితమ్మ
చప్పిడి పద్మమ్మ

అల్లుళ్ళు:
పెంచలనాయుడు
డా॥ జనార్ధననాయుడు

గిరి - శివమాల
సురేష్ - పద్మజ
సంహిత, శ్రీరిషి, (మునిమనుమలు)

శశాంక్, రోహన్ (మునిమనుమలు)
రావి జ్యోతి - బాలాజి
అవినాష్, శౌర్య (మునిమనుమలు)

Harsha Ads 9849188889

# పథకాల అమలులో వివక్ష వద్దు

**- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి హితవు**




వరద పరిహారం సక్రమంగా అందకపోవడంతో అనేక ప్రాంతాల్లో నిరుపేద ప్రజలు అన్యాయానికి గురయ్యారని, జిల్లా కలెక్టర్ ఇప్పటికైనా ఆయా ప్రాంతాల్లో రీ-సర్వే నిర్వహించి బాధితులందరికీ న్యాయం చేయాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని చింతారెడ్డిపాళెం గ్రామంలో ఆయన ఈ నెల బుధవారం 'ప్రజాబాట' నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు మాట్లాడుతూ, తమకు వరద పరిహారం అందలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో, ఎమ్మెల్యే స్పందించి అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి వివక్ష చూపవద్దని, అర్హులైన పేదలందరికీ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి జిల్లా ప్రధాన కార్యదర్శి మనుబోలు సికిందర్‌రెడ్డి, స్థానిక నాయకులు కృప, రమణమ్మ, తేజ, శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# భార్గవ 'నిపుణ'తను అభినందించిన ఎస్పీ



కేవలం మూడేళ్ళ వయసులోనే విశేష ప్రతిభ కనపరుస్తూ, ఇటీవల హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన 'నిపుణ' కార్యక్రమంలో పాల్గొని 'నిపుణ' అవార్డును సాధించిన భార్గవ కృష్ణ నాయక్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ గజరావుభూపాల్ అభినందించి సత్కరించారు. పెళ్ళకూరు ఎస్ఐ ఎం. రవినాయక్ కుమారుడైన భార్గవ కృష్ణనాయక్ ఇంత చిన్నవయసులోనే ఇప్పటికే ఎన్నో ప్రతిభా అవార్డులు అందుకోవడం విశేషం. భవిష్యత్తులో మరెన్నో ఉన్నతస్థాయి అవార్డులను అందుకోవాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ రవినాయక్‌ను కూడా ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎం. గంగాధర్, జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు పాల్గొన్నారు.

# విఆర్‌సి వాకర్స్ అధ్యక్షుడిగా పందిళ్ళపల్లి



విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్‌కు సోమవారం నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. నేతాజీ (ఎంఎస్ఆర్) ఫైలట్ హైస్కూల్ నందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు పాల్గొని 2016 సంవత్సరానికి నూతన కార్యవర్గ సంఘం అధ్యక్షులుగా పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి, గౌరవాధ్యక్షులుగా డా॥ సి. భాస్కరరావు, డా॥ ఎ. పెంచలయ్య, ఉపాధ్యక్షులుగా ఎం.వెంకటాద్రిరెడ్డి, వేముల ప్రసాదరావు, కార్యదర్శి వి.వి.రమణమూర్తి, సహాయకార్యదర్శులుగా బి.వేణుగోపాలరెడ్డి, ఎ.రవీంద్రనాథ్, కోశాధికారి తులసి వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ జె.వెంకటేశ్వర్లు(పి.డి), జాలీవాకర్ జుటూరు వెంకటేశ్వర్లు, ఆఫీస్ ఇన్‌ఛార్జి పి.రాఘవేంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నిక అధికారిగా పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ యం.వి.సుబ్బారెడ్డి వ్యవహరించారు. 2016 సంవత్సరంలో ప్రతినెల నడకపై అవగాహన సదస్సులు ర్యాలీలు నిర్వహిస్తామని, మెడికల్ క్యాంపులు, రక్తదాన శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ, చెట్లు నాటే కార్యక్రమాలు చేపట్టి వాకర్స్ అసోసియేషన్ అభివృద్ధికి పాటుపడతానని అధ్యక్షులు పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి తెలిపారు.

# నంది నాటకోత్సవాలకు 'వీరబ్రహ్మేంద్ర స్వామి'

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతియేటా నిర్వహించే నంది నాటకోత్సవాలకు ఈ యేడాది నెల్లూరుజిల్లా నుండి 'శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి' పద్య నాటకం ఎంపికైంది. రాష్ట్ర స్థాయిలో 40 పద్యనాటకాలు పోటీకి రాగా ప్రాథమిక పరిశీలనలో 10 నాటకాలను ఎంపిక చేశారు. అందులో జిల్లాకు సంబంధించి శ్రీ శ్రీనివాస నాట్యమండలి వారి "శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి" పద్యనాటకం ఎంపిక కావడం సింహపురి ప్రజలకు గర్వకారణం. ఈ నాటకంలో వీరబ్రహ్మేంద్ర స్వామి పాత్రను పోషిస్తూ దర్శకత్వపు బాధ్యతలను అభినవ అన్నమయ్య తిరుపతి హరగోపాల్ నిర్వహించారు. జనవరి 2016 తిరుపతిలో నంది నాటకోత్సవాలు జరుగుతాయని శ్రీ శ్రీనివాస నాట్యమండలి అధ్యక్షులు వీరిశెట్టి హజరత్‌బాబు తెలిపారు.

# సేవాతపస్వికి 'కళాతపస్వి' బిరుదు ప్రదానం



కళలకు, కళాకారులకు, కళాసంస్థలకు తనవంతు సహాయసహకారాలు అందిస్తూ అన్నదాత హజరత్‌బాబుగా పేరు సంపాదించుకున్న వినయశీలి, మితభాషి, దానకర్ణుడు మురళీకృష్ణ 70 హోటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ వీరిశెట్టి హజరత్‌బాబుకు సంస్కృతి తరంగాలు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్టు వ్యవస్థాపకులు రేణిగుంట రాజశేఖర్, ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి 'కళాతపస్వి' బిరుదును ప్రదానం చేసి గజమాల, పూలకిరీటం, శాలువ, సన్మాన పత్రంతో ఘనంగా సన్మానించారు. మంగళవారం నెల్లూరు టౌన్‌హాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక సభ సహకారంతో నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ సరదా సంగీత, నృత్య పోటీలు ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగాయి. ఎన్నో ఏళ్లుగా నెల్లూరులో కళలను ప్రోత్సహిస్తూ కళాకారులను ఉత్సాహపరుస్తున్న హజరత్‌బాబును సత్కరించారు. అనంతరం ట్రస్ట్ తరపున కంభం విజయరామిరెడ్డిని రేణిగుంట రాజశేఖర్ రోజామాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నాట్య మయూరి బేబి సుమేధ ప్రత్యేకంగా ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు నలుబోలు బలరామయ్యనాయుడు, బి.వి.నరశింహం, వల్లకవి వెంకటసుబ్బారావు, శింగంశెట్టి మురళీమోహన్‌రావు, టివి ఆర్టిస్టు సూర్య తదితరులు పాల్గొన్నారు. వ్యాఖ్యాతగా దగ్గుపాటి రాధాకృష్ణ వ్యవహరించారు. సుధాకర్‌రెడ్డి రచనా దర్శకత్వంలో శృతి కళానికేతన్ నెల్లూరు వారిచే ప్రదర్శించిన 'మానవధర్మం సాంఘిక నాటిక ప్రదర్శన ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసింది. నటీనటులు వారి వారి పాత్రలకు న్యాయం చేశారు. అనంతరం శాస్త్రీయ సంగీతం, శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యంలో గెలుపొందిన వారికి శాలువాలతో, మెమొంటోలు బహూకరించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా శాస్త్రీయ నృత్యంకు బాడిగ అనిల్‌కృష్ణ (అవనిగడ్డ), భాగవతుల వెంకటరామశర్మ (విజయవాడ), శాస్త్రీయ సంగీతంకు బ్రహ్మానందం (విజయవాడ) వ్యవహరించారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుండి దాదాపు 85 బృందాలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమాలను ట్రస్ట్ వ్యవస్థాపకులు రేణిగుంట రాజశేఖర్ పర్యవేక్షించారు.

# ఆందోళన బాటలో న్యాయవాదులు

నెల్లూరు గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఓ సంఘటనపై నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆందోళనకు దిగారు. ఇటీవల ఓ కేసు విషయమై తన పిటిషనర్ల తరపున రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళిన న్యాయవాది పత్తి రాజేష్‌పై ఎస్సై సుబ్బారావు దుర్భాషలాడి దౌర్జన్యానికి దిగడాన్ని నిరశిస్తూ న్యాయవాదులు జనవరి 13వ తేదీ వరకు విధులు బహిష్కరణకు పిలుపునిచ్చారు. బుధవారం బార్ అసోసియేషన్ హాల్లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, సీనియర్ న్యాయవాదులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, అబ్బయ్యరెడ్డి, రోజారెడ్డి, రామిరెడ్డి తదితరులు సమావేశమై ఎస్సై సుబ్బారావును సస్పెండ్ చేసేంతవరకు ఆందోళన కొనసాగించాలని నిర్ణయించారు.

# శ్రీసిటీలో గ్రామీణ విద్యార్థులకు అవగాహన శిబిరం






'సామాజిక అవసరాలు, టెక్నాలజీ వినియోగం ద్వారా తగు పరిష్కారాలు' అనే అంశంపై, గ్రామీణ విద్యార్థులకు ఐఐటి చెన్నై వారిచే మూడురోజుల అవగాహన శిబిరం మంగళవారం ప్రారంభమైంది. శ్రీసిటీలోని ట్రిపుల్ ఐటి కళాశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని శ్రీసిటీ జనరల్ మేనేజర్ సన్యాసరావు, చెన్నై ఐఐటి ప్రొఫెసర్ గణేష్ లాంఛనంగా ప్రారంభించారు. శ్రీసిటీ పరిసరాల్లోని ఇరుగుళం, మాదనపాళెం ప్రభుత్వ హైస్కూళ్ళ విద్యార్థులతో పాటు, శ్రీసిటీ-చిన్మయా పాఠశాల విద్యార్థులు సుమారు 80 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సన్యాసరావు మాట్లాడుతూ, విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చెన్నై ఐఐటికి అనుబంధంగా పనిచేస్తున్న సిఎస్ఐఇ (సెంటర్ ఫర్ ఇన్నొవేషన్ అండ్ ఎంటర్‌ప్రినర్‌షిప్) ద్వారా గ్రామీణ ప్రాంతాల వారికి సామాజిక అవసరాలు, టెక్నాలజీని ఉపయోగించుకుని అతి తక్కువ ఖర్చుతో తమ అవసరాలను తీర్చే ఉత్పత్తులను పొందడం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో సిఎస్ఐఇ సిబ్బంది జేమ్స్, విజయలక్ష్మి, విద్యా శరవణన్, శ్రీసిటీ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.




శుభాకాంక్షలు
తెలుగుదేశంపార్టీ నాయకులకు, కార్యకర్తలకు, గూడూరు ప్రజానీకానికి, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
2016 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.
కోడూరు శ్రీనివాసులురెడ్డి
టిడిపి సీనియర్ నాయకులు
గూడూరు





మా ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, గూడూరు ప్రాంత ప్రజానీకానికి
2016 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు
అట్ల శీనయ్య యాదవ్, ప్రొప్రైటర్
శ్రీ లక్ష్మీ శ్రీనివాస పాన్‌బ్రోకర్స్ & దిలీప్ హైర్స్
1/573-1, మాళవ్యనగర్, గూడూరు, నెల్లూరుజిల్లా.

# 'ప్రభా'తం

రష్యా, ఆఫ్ఘనిస్తాన్ పర్యటనను ముగించుకున్న భారత ప్రధాని నరేంద్రమోడీ తిరిగి స్వదేశానికి వస్తూ మధ్యలో ఆకస్మికంగా పాక్‌లో దిగడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం కలిగించడమే కాక..అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసింది. అప్పటికప్పుడు ప్రధాని ఉదయం అలా నిర్ణయించుకుని సాయంత్రానికల్లా పాక్‌కు చేరుకోవడం ఎంతైనా ఆశ్చర్యకరమే!.. అయినప్పటికీ, ప్రధాని తీసుకున్న ఈ నిర్ణయం మాత్రం సముచితమేననడంలో ఎలాంటి సందేహం లేదు.

ఇప్పుడే కాదు, తొలి నుంచి ప్రధాని తనదైన శైలిలో పాలన ప్రారంభించారు. ఏది మంచో ఏది చెడో ఆచితూచి చూసుకున్న తర్వాతనే విజ్ఞతతో మంచివైపుకు అడుగు ముందుకు వేయడం ఆయన నైజం. అందుకే, వాస్తవానికి తన పర్యటన షెడ్యూల్‌లో పాక్ పర్యటన లేకపోయినప్పటికీ, భద్రతా కార ణాలను సైతం పక్కకు పెట్టి లాహోర్‌లో రెండుగంటల పాటు ఆగి మోడీ అందరికీ విస్మయం కలిగించారు. ఇక్కడే కాదు ఆయన ఎక్కడికి వెళ్ళినా.. వెళ్ళిన చోటల్లా భేష్ అన్పించుకుని దటీజ్ మోడీ అన్పించు కుంటారు. పాక్ విషయంలోనూ అదే జరిగింది.

తొలుత, ఢిల్లీ వెళ్ళే దారిలో లాహోర్‌లో దిగి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్‌తో భేటీ అవుతానంటూ మోడీ చేసిన ట్వీట్.. కలకలం సృష్టించింది. కనీవినీ ఎరుగని ఓ సరికొత్త దౌత్య సంప్రదాయానికి శ్రీకారం చుట్టినట్లయింది. అంతేకాదు, పాక్‌లో దిగగానే పాక్ ప్రధాని నవాజ్‌షరీఫ్ ఆత్మీయ ఆలింగనంతో మోడీని స్వాగతించడం, ప్రధాని మోడీ నవాజ్‌షరీఫ్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పడం, ఇద్దరు నేతలూ ఎంతో అభిమానంతో చేతిలో చేయివేసుకుని నడుచు కుంటూ వెళ్ళడం, ఒకే హెలికాప్టర్‌లో ఇరు దేశాధి నేతలూ ప్రయాణించడం.. ఇలా అన్నీ సంచలనాలే. నవాజ్‌షరీఫ్ నివాసభవనంలోకి వీరు వెళ్ళగానే అక్కడికి వచ్చిన ఆయన మాతృమూర్తికి ప్రధాని మోడీ పాదాభివందనం చేయడం, ఆ తర్వాత ఆయన మనుమరాలి వివాహం సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించడం, అక్కడినుంచి తిరిగి పాక్ ప్రధాని తోడు రాగా విమానాశ్రయానికి బయలుదేరి రావడం..ఈ ఆత్మీయమైన ఘటనలన్నిటికీ మోడీ అనుసరించిన సానుకూల వైఖరే కారణం. ఈ స్నేహపూర్వక ధోరణే సర్వత్రా అందరి ప్రశంసలూ అందుకుంది. అంతేకాదు, పొరుగువారి పట్ల మనం అనుసరించాల్సిన ప్రేమపూర్వక మైత్రికి ఈ పర్యటన ఒక ఉదాహరణగా నిలిచింది.

భారత ప్రధాని మోడీ ఇలా అప్పటికప్పుడు నిర్ణయించుకుని హుటాహుటిన పాక్‌కు వెళ్ళి రావడం ఒక కలకలమే. అందులోనూ దాదాపు పదేళ్ళ తర్వాత భారత ప్రధాని పాక్ రావడం ఇదే తొలిసారి కావడం, దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక పాకిస్తాన్‌ను సందర్శించిన నాల్గవ భారత ప్రధాని నరేంద్రమోడీయే కావడం విశేషం. అయితే ఇదొక్కటే కాదు, ప్రధాని పాక్ పర్యటనలో మరెన్నో విశేషాలున్నాయి. పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ జన్మదినం, భారత మాజీప్రధాని వాజ్‌పేయి జన్మదినం కూడా ఆ రోజే కావడం, పాక్ వ్యవస్థాపకుడైన మహమ్మదాలీ జిన్నా జయంతి కూడా అదే రోజు కావడం విశేషం మీద విశేషాలే. 2004లో అప్పటి ప్రధాని వాజ్‌పేయి పాక్‌లో పర్యటించిన తర్వాత, భారత ప్రధాని ఆ దేశానికి వెళ్ళడం ఇదే తొలిసారి కావడం, అదేరోజున వాజ్‌పేయి 91వ జన్మదినం కావడం కాకతాళీయమే అయినప్పటికీ.. ఇవన్నీ విశేషాలే. ఇరుదేశాల మధ్య సుహృద్భావ వాతావరణానికి ఎంతో కృషి చేసిన వాజ్‌పేయి పుట్టినరోజున ప్రధాని నరేంద్రమోడీ పాక్‌లో అడుగిడి.. పాక్‌లో అందరినీ చిరునవ్వులతో ముంచెత్తి మళ్ళీ విమానాశ్రయం చేరుకునేదాకా పాక్ అధినేత ఆత్మీయతను చూరగొనడం వంటివన్నీ అపూర్వ ఘట్టాలే. ఇరుదేశాల మైత్రీయాత్రలో ఇలాంటివి చక్కని మైలురాళ్ళుగా నిలచిపోతాయని ఘంటాపథంగా చెప్పవచ్చు. అంతేకాదు, ఈ పర్యటన సందర్భంగా ప్రధానులిద్దరూ ఎంతో సుహృద్భావ వాతావరణంలో సమా వేశం కావడం, రెండు దేశాల మధ్య సానుకూల వాతావరణాన్ని పాదుగొల్పడానికి ఫలవంతమైన చర్చలు జరపాలని నిర్ణయించు కోవడం, ఆ మేరకు భారత్-పాక్ విదేశాంగ మంత్రులు వచ్చే నెల ఇస్లామాబాద్‌లో సమావేశం కావాలని నిర్ణయించడం.. అన్నీ శుభ సంకేతాలే. ఇలా.. అందివచ్చిన ఆత్మీయతను అందుకుని అపార విజ్ఞతతో, రాజకీయానుభవజ్ఞతతో వ్యవహరించి ఇరుదేశాల మధ్య మరింత మైత్రీ భావనలు వెల్లివిరిసేందుకు దోహదం చేసి.. దటీజ్ మోడీ అన్పించుకున్నారు. ప్రధాని లాహోర్ పర్యటనను ఐక్యరాజ్యసమితి, అమెరికాలు కూడా స్వాగతించా యంటే, భారత్-పాక్‌ల మధ్య ద్వైపాక్షిక చర్చలు చక్కగా సాగడానికి ఈ పర్యటన దోహదపడుతుందనే అభిప్రాయాన్ని వారు వెల్లడించారంటే అదంతా మోడీ దౌత్యరీతికి నిదర్శనమేననవచ్చు. భారత్-పాక్‌ల మధ్య అనిశ్చితంగా వున్న సంబంధాల నేపథ్యంలో నరేంద్ర మోడీ 'రీసెట్' మీటను నొక్కారంటూ అమెరికాలోని వాషింగ్టన్ పోస్ట్ పత్రిక పేర్కొనడం సరైన మాట. అయితే, ఇలాంటి సాహసయాత్రలు దేశభద్రతకు ముప్పు.. అంటూ కాంగ్రెస్ విమర్శించినప్పటికీ, అంతరంగాలు మారితే అంతరాలు ఏముంటాయన్నట్లుగా జరిగిన ఈ పర్యటన ప్రపంచమంతటా అందరి ప్రశంసలకూ పాత్రం కావడం విశేషం. పార్లమెంట్‌కు మాటమాత్రమైనా చెప్పకుండా ప్రధాని మోడీ పాక్‌కు వెళ్ళినప్పటికీ..అది స్వాగతించదగిన పరిణామమేనంటూ సిపిఐ జాతీయనేత అభిప్రాయపడడం, కాశ్మీర్ వేర్పాటువాదులు సైతం మోడీ ఆకస్మిక పర్యటనను హర్షించడం అన్నీ బహు ఆశ్చర్యకరాలే!..

ఇలా ఎన్నో విశేషాలు, విస్మయాల కలబోతగా, ఇరుదేశాల ఆత్మీయతాలతల పెనవేతగా జరిగిన ఈ పర్యటన ప్రధాని కీర్తిని, దౌత్యరీతినీ.. మొత్తంగా భరతజాతి ఖ్యాతినీ మరింతగా పెంచాయనే చెప్పవచ్చు.ఏదేమైనా, ఈ ఆకస్మిక పర్యటన సందర్భంగా ఇరుదేశాల మధ్య స్నేహసుమాలు మరింతగా గుభాళింపజేసి.. తన పర్యటనను జయప్రదం గావించుకుని.. దటీజ్ మోడీ అన్పించుకున్నారు.. భారత ప్రధాని నరేంద్రమోడీ!

## దటీజ్.. మోడీ!



ప్రధాని మోడీ వున్నట్లుండి పాక్‌కు వెళ్ళి రావడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఇది సరికాదంటూ కాంగ్రెస్ విమర్శించినా.. ఇరుదేశాల మధ్య సయోధ్యా వారధుల్ని మరింత బలోపేతం చేసేవిధంగా వున్న ప్రధాని మోదీ పర్యటన ప్రపంచవ్యాప్తంగా అందరి ప్రశంసలకూ పాత్రమైంది. భారత్-పాక్ ప్రధానులిద్దరూ ఈ సందర్భంగా సమావేశమై, ఇరుదేశాల మధ్య సానుకూల వాతావరణాన్ని పాదుగొల్పడానికి చర్చలు జరపాలని నిర్ణయించుకోవడం శుభ సంకేతమే!..

# సరుకులు సక్రమంగా అందించాలి



అర్హులైన లబ్ది దారులకు రేషన్ షాపుల వారీగా ఇ-పాస్ సిస్టం ద్వారా సరుకులను సమస్యలు లేకుండా పూర్తి స్థాయిలో అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌హాలులో స్థానిక పొదలకూరు రోడ్డు, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ కార్యాలయం పరిధిలోని 84వ రేషన్‌షాపుకు సంబంధించిన కొంతమంది రేషన్‌కార్డుదారులు వచ్చి ఇ-పాస్ సిస్టంలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యల వల్ల తమకు సరిగా సరుకులు ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ స్పందించి సంబంధిత రేషన్‌షాపు డీలర్ మరియు సంబంధిత సాంకేతిక ఆపరేటర్లను వాటి సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అలాగే స్వయంగా బయోమెట్రిక్ సిస్టం ద్వారా సంబంధిత రేషన్ కార్డుదారుల ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులను పరిశీలించి తగు సూచనలిచ్చారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జిల్లా పౌరసరఫరాల అధికారి ధర్మారెడ్డి, మాజీమున్సిపల్ ఛైర్మెన్ శ్రీమతి టి.అనురాధ తదితర సాంకేతిక సిబ్బంది వున్నారు.

# గోపుర ద్వారంలో నటరాజుకు పూజలు

### - మూలస్థానేశ్వరాలయంలో నేత్రపర్వంగా శివ ముక్కోటి -

శివ ముక్కోటి ద్వారదర్శనం వేడుకల్లో భాగంగా నటరాజస్వామి ఆలయ గోపుర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చి నేత్రపర్వం చేశారు. ధనుర్మాసం, ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని గతనెల 26న నెల్లూరు నగరంలోని శ్రీ మూలస్థానేశ్వరాలయంలో శివ ముక్కోటి ద్వార దర్శనం వేడుకలు నిర్వహించారు. ఆలయ గోపుర ద్వారంలో కన్నులపండువగా నిర్వహించిన ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం, స్వామివారికి పేట ఉత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధనరెడ్డి పర్యవేక్షణలో ఈ వేడుకలు జరిగాయి. ఉభయకర్తగా దేవిశెట్టి వెంకటసుబ్బయ్య వ్యవహరించారు. విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## ఈ పండుగ అవసరమా?

కోటిరూపాయల ఖర్చుతో పక్షుల పండుగ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. స్వేచ్ఛాజీవులైన పక్షులు స్వేచ్ఛా విహారానికి, సంతానోత్పత్తికి వేల కిలోమీటర్ల దూరం నుండి వస్తాయి. వ్యక్తుల ఆనందం కోసం వాటి స్వేచ్ఛను హరించడం సబబు కాదు. నాయకులు పోటీలు పడి ఫ్లెక్సీలు కట్టుకుంటారు. జులాయిలు పక్షుల మీద రాళ్లు విసురుతుంటారు. సభలు, సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పక్షులను బెదరగొడుతుంటారు. రెండురోజులు పండుగతో గలభా సృష్టించి పక్షులను బెదిరేలా చేయొద్దు. పర్యాటకులు ఏడాది పొడవునా ప్రశాంతంగా పక్షుల్ని తిలకించే ఏర్పాటు చేయండి.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## భావిభారత పౌరులు

నేటి బాలలే రేపటి పౌరులు. తల్లిదండ్రులు, గురువులు నేటి బాలలను రేపటిపౌరులుగా అయ్యేందుకు తగిన శిక్షణ ఇచ్చి ఉత్తమ పౌరులుగా తయారు చేయాలి. సినిమాలు, టీవీలు నేటి బాలలను రేపటి ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దేందుకు మంచి సినిమాలు, మంచి సీరియల్స్ తీయాలి. ఇప్పుడు మనం ప్రత్యక్షంగా చూస్తున్న మేజర్ నేరస్థులు బాలనేరస్థులు చాలదా? సినిమాలలో కూడా బాల నేరస్థులను చూడాలా? 'బాల నేరస్థుడు' సినిమా విడుదలకు హైకోర్టు ఎందుకు ఓకే చెప్పిందో అర్ధం కావడం లేదు.

కురుగూరు రంగనాథం, నెల్లూరు.

## న్యాయం ఏమైంది

డబ్బుంటే భారతదేశంలో ఏదైనా సాధ్యమే అని ఋజువవుతోంది. తాగి కారు నడిపి ఒకరి చావుకు కారణమైన కేసులో సల్మాన్‌ఖాన్ నిర్దోషిగా విడుదలకావడం చూస్తుంటే ఈ దేశంలో న్యాయవ్యవస్థ సైతం డబ్బుతో గబ్బు పట్టిందని పిస్తుంది. బాడీగార్డ్ రవీంద్రపాటిల్ సాక్ష్యాన్ని నమ్మని న్యాయ స్థానం వైఖరి ఏమిటో అర్థం కావడం లేదు. సల్మాన్‌ఖాన్‌కు రవీంద్ర పాటిల్ శత్రువు కాదు తప్పుడు సాక్ష్యం చెప్పడానికి! మన చట్టాలు డబ్బున్నోళ్లను రక్షించడానికి తప్ప సామాన్య ప్రజల రక్షణకు ఏ విధంగానూ ఉపయోగపడడం లేదు.

సాయిభాస్కర్, నెల్లూరు.

## దండగ కానుక

సంక్రాంతి చంద్రన్నకానుక అంటూ మళ్లీ ఓ దండగ కార్యక్రమం పెట్టారు. ఇలాంటి పనికిమాలిన పథకాలతోనే ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. ప్రజలకు కావాల్సింది ఫ్రీ బియ్యం, ఫ్రీ బెల్లం కాదు. వాటిని కొనుగోలు చేయగల శక్తి. ప్రజలకు ఉపాధి అవకాశాలు పెంచాలి. వ్యాపారాలు పెర గాలి. లావాదేవీలు జరగాలి. ఒక పండక్కి చంద్రబాబు ఫ్రీ సరుకులివ్వగానే ఏడాది మొత్తం సరిపోవుగా! అందులోనూ వీటిలో నాణ్యత కూడా అంతంతమాత్రంగానే ఉంటోంది.

తాటిపర్తి పుల్లారెడ్డి, సంగం.

## వాళ్ళూ.. వాళ్ళూ ఒకటే!

అమరావతి రాజధాని శంకుస్థాపనకు కేసీఆర్ వచ్చాడు. కేసీఆర్ చేసిన చండీయాగానికి చంద్రబాబు హాజరయ్యారు. మరి మధ్యలో ఓటు-నోటు కేసు ఏమైనట్లో? దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్నట్లు ఈ కేసు విషయంలో ఇద్దరూ రాజీ పడిపోయారు. చెరో రాష్ట్రాన్ని పంచుకుని కేసును నీరుగార్చే సారు. కేసీఆర్ ఆర్భాటపు ప్రకటనలు విన్న ప్రజలు మాత్రం వెర్రివాళ్లయ్యారు. ఎన్ని తిట్టుకున్నా నాయకులు నాయకులు ఒకటేనని మరోసారి ఋజువు చేశారు.

సి.డి.ప్రకాశ్, హైదరాబాద్.

➤ వీళ్లు నిలబడేనా...

# కాంగ్రెస్‌ని నిలబెట్టేనా?



**ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌పార్టీకి కంచుకోటలాంటి జిల్లాల్లో నెల్లూరు ఒకటి. రాజకీయాల్లో పెను ప్రభంజనాలొచ్చినప్పుడు కూడా ఈ జిల్లాలో కాంగ్రెస్ తట్టుకుని నిలబడింది. ఇక ఇక్కడ కాంగ్రెస్‌కు నాయకత్వం వహించింది కూడా ఉద్ధండులే! రాజకీయంగా యోధానుయోధులే! జిల్లాలో పేరుమోసిన రాజకీయ కుటుంబాలన్నీ కాంగ్రెస్‌లో వున్నవే! ఆనం, నేదురుమల్లి, బెజవాడ, మాగుంట, మేకపాటి, నల్లపరెడ్డి... వంటి కుటుంబాలు కాంగ్రెస్ నీడలోనే ఎదిగాయి.**

ఈరోజు వీటిలో ఒక్క కుటుంబం కూడా కాంగ్రెస్‌లో లేదు. విభజన తర్వాత రాష్ట్రంలో మాదిరిగానే ఈ జిల్లాలో కూడా కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోయింది. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ టిక్కెట్ మీద పోటీ చేస్తామన్న వాళ్లే కరువయ్యారు. అంతకు ముందు కాంగ్రెస్ టిక్కెట్ దొరికితే సిక్కిం లాటరీ తగిలినట్లుగా నాయకులు గంతులేసేవాళ్లు. మొన్న ఎన్నికల్లో మాత్రం పిలిచి టిక్కెట్లు ఇస్తామన్నా కూడా ఆ దరిదాపుల్లోకి పోలేదు. జిల్లాలో అంత దరిద్రంగా తయారైంది కాంగ్రెస్ పరిస్థితి.

ఇప్పుడు జిల్లాలో సిపిఎం, సిపిఐ, లోక్‌సత్తా, ఆమ్‌ఆద్మీ వంటి పార్టీలున్నట్లే కాంగ్రెస్ కూడా ఉందనుకోవచ్చు. కాంగ్రెస్ కన్నా బీజేపీయే కొంచెం బెటర్‌గా వుండొచ్చు. యోధానుయోధులనుకున్న నాయకులంతా కాంగ్రెస్‌ను వదిలి పోయాక పనబాక లక్ష్మి, పనబాక కృష్ణయ్య, సి.వి. శేషారెడ్డి, చేవూరు దేవకుమార్‌రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, పి.చెంచలబాబు యాదవ్, ఉడతా వెంకట్రావ్ వంటి నాయకులు మిగిలారు. పనబాక కృష్ణయ్యకు జిల్లా కాంగ్రెస్ బాధ్యతలు అప్పగించారు. విభజన ఫలితంగా కాంగ్రెస్ పట్ల ప్రజల్లో అసహ్యం వుందిగాని అభిమానం లేదు. విభజన నాటి కోపతాపాలు ఇప్పట్లో తగ్గకపోవచ్చు. ఒకవేళ తెలుగుదేశం మీద వ్యతిరేకత వస్తే వైకాపా లాభపడుతుంది గాని కాంగ్రెస్‌కు వచ్చే ప్రయోజనమేదీ లేదు. జిల్లా కాంగ్రెస్ బాధ్యతలు ఎవరు తీసుకున్నా ఈ పార్టీని నిలబెట్టడం కష్టమే! ఇక సీపీఎం, సీపీఐ నాయకులు మాదిరిగా ప్రభుత్వం మీద పోరాటాలు చేస్తూ తమ ఉనికిని చాటుకోవడం ఆ పార్టీ నాయకుల దినచర్య కాబోతోంది.

## పండుగతో సరి...

# పర్యాటక ప్రగతి ఏది మరి?



ప్రతి యేడాది సంక్రాంతి, దీపావళి, రంజాన్, క్రిస్మస్ పండుగలు వచ్చినట్లే నెల్లూరుజిల్లాలో ప్రత్యేకంగా పక్షుల పండుగ వస్తుంది. 1999 ప్రాంతంలో జిల్లా కలెక్టర్‌గా వున్న కె.ప్రవీణ్‌కుమార్ ఈ పండుగను మొదలుపెట్టారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరం ఆనవాయితీగా జరుపుతూ వస్తున్నారు. ప్రతియేటా జనవరిలో పెడుతుంటారు. ఈ సంవత్సరం కూడా జనవరి 9, 10తేదీలలో జరపాలని నిర్ణయించారు. ఇందుకు తగ్గట్లు ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి.

సైబీరియా, బంగ్లాదేశ్ వంటి దేశాల నుండి వచ్చే పక్షులకు నేలపట్టు చెరువు విడిది ప్రాంతం. పులికాట్ సరస్సు ఆహార కేంద్రం. పులికాట్‌లో చేపలను వేటాడడం, నేలపట్టు చెరువు మధ్యలో ఉండే చెట్లపై సేద తీరడం ఈ పక్షుల దైనందిన కార్యక్రమం. ఇక్కడ గుడ్లు పెట్టడం, గుడ్లు పొదిగి పిల్లలు కావడం, ఆ పిల్లలకు రెక్కలు వచ్చాక తిరిగి వచ్చిన దేశాలకే పోవడం... ఇదంతా కూడా ఎంతో అద్భుతమనిపిస్తుంది. గుంపులు గుంపులుగా వున్న విదేశీ పక్షులను చూడ్డానికి రెండు కళ్లు చాలవు. పక్షుల పండుగను మొదలుపెట్టాకే ఈ పక్షులను చూడడానికి వచ్చే పర్యాటకులు పెరిగారు.

ఇంతవరకు ఒక సబ్జెక్ట్ అయితే, జిల్లాలో పర్యాటక రంగానికి సంబంధించి ఈ రెండు మూడు రోజులు ప్రాధాన్యత నివ్వడం తప్ప మిగతా సంవత్సరం పొడవునా దాని ఊసే ఎత్తడం లేదు. రెండు రోజులు పక్షుల పండుగ జరపడంతో పర్యాటక ప్రగతిని మమ అనిపిస్తున్నారు. ఆ రెండురోజులు తప్పితే మిగతారోజుల్లో పర్యాటక ప్రాంతాలకు పోవడానికి పర్యాటకులకు ఎలాంటి సదుపాయాలు ఉండడం లేదు. మూడు నెలలు పక్షుల సీజన్. నేలపట్టు పక్షుల కేంద్రం వద్దకు మిగతా రోజుల్లో వెళ్లాలంటే వాహన సౌకర్యం లేదు. చాలా మందికి అసలు నేలపట్టు ఎక్కడ వుందో కూడా తెలియదు. కనీసం పక్షుల సీజన్‌లోనైనా సెలవురోజుల్లో అక్కడకు సూళ్లూరుపేట, నాయుడుపేట వంటి ప్రాంతాల నుండి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయడానికి అధికారులు చొరవ చూపాలి. జిల్లాలో పులికాట్ సరసుతో పాటు కోడూరు, మైపాడు, తూపిలిపాలెం బీచ్‌లు, సోమశిల, కండ్లేరు రిజర్వాయర్‌లు, పెంచలకోన, సిద్ధేశ్వరం, ఉదయగిరి వంటి పర్యాటక కేంద్రాలను ఒక టూరిజం ప్యాకేజీగా ఏర్పాటు చేసి సెలవు దినాలలో వాహనాలను ఏర్పాటు చేస్తూ పర్యాటకులకు వాటిని చూపిస్తుంటే జిల్లాలోనూ టూరిజం క్రమక్రమంగా అభివృద్ధి చెందే అవకాశముంది.


# 2015లో బాగానే పని చేశాం




2015 సంవత్సరానికి జిల్లాలో పోలీసులు ఒళ్లు వంచి బాగానే పనిచేశారని, హోంగార్డు నుండి తన వరకు బాగానే కష్టపడ్డారని జిల్లా ఎస్పీ గజరావు భూపాల్ పేర్కొన్నారు. ఏ ఎస్పీ అయినా ప్రతి యేడాది చివరలో విలేకర్ల సమావేశం పెట్టి ఆ యేడాది క్రైం వివరాలను అందజేస్తుంటారు. ఈ నేపథ్యంలోనే ఆయన సోమవారం పోలీసు గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రెస్‌మీట్ పెట్టి క్రైం వివరాలు వెల్లడించారు. 2014లో 12,894 కేసులు నమోదు కాగా, ఈ 2015లో 10,106 కేసులు మాత్రమే నమోదయ్యాయని, హత్యలు, హత్యాయత్నాలు, కిడ్నాప్‌లు వంటి కేసులు తగ్గగా, రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు మాత్రం పెరిగాయన్నారు. ఈ యేడాది మొత్తం 14,18,95,146 రూపాయల విలువైన సొత్తు చోరీ కాగా, 8,10,35,362 రూపాయలను రికవరీ చేయడం జరిగిందన్నారు. నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన దోపిడీ కేసులో తమ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి నగదు మొత్తాన్ని రికవరీ చేయడమే కాకుండా ఈ కేసులో వున్న పెద్ద తలకాయలను పట్టుకోవడం జరిగిందన్నారు. ఇక ఎర్ర చందనం అక్రమరవాణాపై ఉక్కుపాదం మోపి చాలావరకు స్మగ్లింగ్‌ను అరికట్టామన్నారు. అలాగే ఆత్మకూరులో బంగారు దుకాణంలో జరిగిన దోపిడీ కేసులోనూ, నెల్లూరు కాపువీధి జ్యూయలరీ షాపులో జరిగిన దోపిడీలోనూ తమ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి దోపిడీకి గురైన మొత్తం సొమ్మును రికవరీ చేసారన్నారు. మహిళలపై దాడులను నియంత్రించామని, ఎస్సీ, ఎస్టీ కేసులను సైతం నియంత్రించామని చెప్పారు. పోలీసు స్టేషన్‌కు రాలేని బాధితుల కోసం జిల్లాలో ఐక్లిక్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నవంబర్‌లో కురిసిన భారీవర్షాల సమయంలో పోలీసు సిబ్బంది సమిష్టిగా పనిచేసి 8,900మంది ప్రజలను రక్షించారన్నారు. 2016లోనూ ఇంకా శక్తివంతంగా పనిచేస్తామని, నేరాలను అదుపు చేస్తామని, ప్రజలకు ప్రశాంతంగా జీవించే అవకాశం కల్పిస్తామని ఎస్పీ గట్టిగా చెప్పారు. పెరిగిన జనాభాను దృష్టిలో పెట్టుకుని నెల్లూరు రూరల్ పరిధిలోని ధనలక్ష్మీపురంలో కొండాయపాళెంలోనూ, అలాగే చిల్లకూరు మండలం వరగలిలోనూ కొత్త పోలీసుస్టేషన్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# ఏసీ వాకర్స్‌కు కొత్త నాయకత్వం




నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్‌కు కొత్త కార్యవర్గం ఏర్పాటైంది. నూతన అధ్యక్షునిగా వి. రంగారావు, ఉపాధ్యక్షులుగా బాసం శేషగిరిరావు, నలబోలు బలరామయ్యనాయుడు, వీరిశెట్టి హజరత్‌బాబు, హరిప్రసాద్ ఎన్నికయ్యారు. అదేవిధంగా కార్యదర్శిగా స్వర్ణ రమేష్, సహాయ కార్యదర్శులుగా అమరేంద్రరెడ్డి, నారాయణరావు, కోశాధికారిగా రవిచంద్ర ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాఘవేంద్రషెట్టి, ఇన్‌స్టలేషన్ ఆఫీసర్‌గా డాక్టర్ అంకిరెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా గత కార్యవర్గాన్ని, ఇప్పటి కార్యవర్గసభ్యులను అందరూ అభినందించారు. అసోసియేషన్ మాజీ కార్యదర్శి బి.శేషగిరిరావు అసోసియేషన్ కార్యక్రమాలకోసం రూ. 10,116 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమాల్లో శ్రీనివాసకుమార్, నిర్మల నరసింహారెడ్డి, బెజవాడ సుందరరామిరెడ్డి, డాక్టర్ సత్యనాథ్, సత్యం, స్నేహ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# నెల్లూరు కబుర్లు

## చంద్రబాబు రాక



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 3వ తేదీన జిల్లా పర్యటనకు రానున్నారు. 2వ తేదీ నుండి మూడోవిడత 'జన్మభూమి – మా ఊరు' కార్యక్రమం మొదలు కాబోతోంది. 2వ విడతలోనే సీఎం వస్తాడనుకున్నా ఆయన రాలేదు. 3వ తేదీ ఆయన ఉదయగిరి నియోజకవర్గంలో జరిగే 'జన్మభూమి – మా ఊరు' కార్యక్రమంలో పాల్గొంటారు. అదేరోజు కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడుతో కలిసి వెంకటాచలం మండలంలో జరిగే కొన్ని అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలలోనూ ఆయన పాల్గొంటారు.

## టౌన్‌హాల్లో మహాభారత ఉపన్యాసాలు

నెల్లూరు పద్యకళాపరిషత్ ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాల్‌లో జనవరి నెల 6వ తేదీ నుండి 10వ తేదీ వరకు ఆంధ్రమహాభారత ఉపన్యాసాలు జరుగనున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం 6.30గంటలకు సభా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అనంతరం డా॥ మేడసాని మోహన్‌చే "ఆశ్రమవాస" పర్వము – ప్రథమాశ్వాసముపై ఉపన్యసిస్తారు. 7వ తేదీ జరిగే కార్యక్రమంలో మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి "ఆశ్రమవాస" పర్వము – ద్వితీయా శ్వాసముపై ఉపన్యసిస్తారు. 8వ తేదీన ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు "మౌసల" పర్వముపై ఉపన్యసిస్తారు. 9వ తేదీన ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు "మహాప్రస్థానిక" పర్వంపై ఉపన్యసిస్తారు. 10వ తేదీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి "స్వర్గారోహణ" పర్వంపై ఉపన్యసిస్తారు. ప్రతిరోజూ సభ ప్రారంభానికి ముందు సుప్రసిద్ధ రంగస్థల కళాకారులచే పద్మనాభరాజు ఆధ్వర్యంలో పద్యపఠనం జరుగుతుంది. ఈ కార్యక్రమాలకు సంగీతాభిమానులు, సాహిత్యాభిమానులు, కళాకారులు, కళాపోషకులు పాల్గొని జయప్రదం గావించాలని పద్యకళాపరిషత్ కార్యవర్గ సభ్యులు నలుబోలు బలరామయ్యనాయుడు కోరారు.

## ఇళ్ల యజమానుల సంఘానికి కొత్త కార్యవర్గం




నెల్లూరు నగరంలోని శ్రీనివాస అగ్రహారం హౌస్ ఓనర్స్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఎన్నుకోవడం జరిగింది. శ్రీనేతాజీ ప్రైవేట్ హైస్కూల్‌లో 27వ తేదీ జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస అగ్రహారం హౌస్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు సమావేశమై నూతన కార్యవర్గం ఎంపిక చేసుకొన్నారు. అధ్యక్షులుగా జి.కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం.చంద్రమౌళి, పి.రాఘవరెడ్డి, జి.శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి పి.లోకేశ్వరరావు, జాయింట్ సెక్రటరీలుగా బి.సరళ, ఎ.కృష్ణమోహన్, కోశాధికారిగా ఎ.రామిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పి.శ్రీనివాసులు, ఎస్.మాలిని, బి.సుబ్బారెడ్డి, జె.రామయ్య, వి.శ్రీహరిరెడ్డి, రాఘవపెరుమాళ్ళు ఎన్నుకోబడ్డారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా ఫౌండర్ ప్రెసిడెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి వ్యవహరించారు.

## 8న జిల్లాస్థాయి ముగ్గుల పోటీలు

పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 9వ తేదీ ఉదయం 9 గంటలకు నెల్లూరు నగరంలోని వి.ఆర్ హైస్కూల్ ఆవరణంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు 9866179385, 9032289762 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

## సుబ్బరామయ్య సంస్మరణ



మున్సిపల్ మంత్రి పి.నారాయణ తండ్రి స్వర్గీయ పొంగూరు సుబ్బరామయ్య 13వ వర్ధంతిని నారాయణ వైద్యకళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. సుబ్బరామయ్య చిత్రపటానికి హాస్పిటల్ ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, సిఇఒ డాక్టర్ విజయమోహన్‌రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనవరి 1 నుండి 15వ తేదీ వరకు సుబ్బరామయ్య వర్ధంతి సందర్భంగా ఉచిత వైద్యసేవలను నిర్వహిస్తున్నట్లు డాక్టర్ శ్రీరామ్ సతీష్ తెలిపారు. అనంతరం హాస్పిటల్ సిబ్బందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్మోహన్ కూడా పాల్గొన్నారు.

# సిఎంఆర్–చందన వీక్లీ డ్రా

- విజేతకు మోటార్ సైకిల్ బహుమతి



క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని నెల్లూరు కనకమహల్ సెంటర్‌లో వున్న సిఎంఆర్ షాపింగ్‌మాల్‌లో ఆదివారం సిఎంఆర్–చందన వీక్లీ డ్రా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టిడిపి కార్పొరేటర్ జడ్.శివప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొని వీక్లీ డ్రా తీశారు. నెల్లూరు రామచంద్రాపురానికి చెందిన శ్రీనివాసులు(కూపన్ నం. 87431) ప్రథమ బహుమతి పొందారు. ఆయనకు బహుమతిగా మోటార్ సైకిల్‌ను అందజేశారు. అదేవిధంగా, డైలీ డ్రాలో గెలుపొందిన పదిమందికి 10 మిక్సీలను బహుకరించారు. సిహెచ్ విజయశరత్ (సామర్లకోట), ఎన్ జయమ్మ (గూడూరు), టి. నరసింహులు (నెల్లూరు మూలాపేట), సాయితేజ, డి.రుషిత్(పోస్టల్ కాలనీ), డి.చరణ్‌తేజ్, డాక్టర్ సుబ్బారావు (నెల్లూరు), విజయమ్మ (మాగుంట లే అవుట్), ఎం.మహదేవరెడ్డి (కలిగిరి), సిహెచ్ వీరాంజనేయులు (నెల్లూరు) ఈ బహుమతులను అందుకున్నారు. ఈ సందర్భంగా ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి మాట్లాడుతూ, సిఎంఆర్–చందనబ్రదర్స్ వారు వినియోగదారులకు తక్కువ ధరలకు వస్త్రాలు, వెండి–బంగారు ఆభరణాలు అందిస్తుండడం సంతోషకరమన్నారు. జడ్.శివప్రసాద్ మాట్లాడుతూ, మేలిమి వస్త్రాలు.. నాణ్యమైన బంగారు వెండి ఆభరణాలు అందిస్తూ సిఎంఆర్–చందన మంచి ప్రజాదరణ పొందుతున్నాయన్నారు. ఇటీవల వరదబాధితులను ఆదుకోవడం లోనూ ఈ సంస్థల సేవాతత్పరత ప్రశంస నీయమన్నారు. సిఎంఆర్ అధినేత మావూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ, కస్టమర్ దేవుళ్ళ కోసం ఈ పండుగ సీజన్‌లలో బంగారు ఆభరణాలను తక్కువ ధరలకే ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాజీ యాడ్స్ అధినేత ఎం.పెంచలయ్య, శైలేష్ పాల్గొన్నారు.

## భగవద్గీత పవిత్ర గ్రంథం

భగవద్గీత పవిత్ర గ్రంథమని, భగవంతుని చేరేందుకు నవవిధ మార్గాలను భగవద్గీత వివరిస్తుందని ప్రముఖ ఉపన్యాసకులు షేక్ నజీర్‌బాషా గురూజీ అన్నారు. సోమవారం కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాలులో భగవద్గీత వైశిష్ట్యం, యోగభారతీయ సంపదపై గురూజీ ప్రవచించారు. యోగ సాధన జీవితంలో ఉన్నత స్థితికి చేరేందుకు ఎంతో ఉపకరిస్తుందన్నారు. గీతలోని శ్లోకాలను, అందులోని తాత్పర్యాన్ని గురూజీ ఎంతో హృద్యంగా వివరించి సభికుల ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో బి.వి.నరసింహం, షేక్ కాలేషా, బొమ్మిన నాగసతీష్, యాదాల నందకిషోర్, వల్లకవి వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

## అటల్ జన్మదిన వేడుకలు



డిసెంబర్ 25వ తేదీన నెల్లూరులో మాజీప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బి.వి.నగర్‌లో మున్సిపల్ కార్మికులకు పండ్లు పంపిణీ చేశారు. గీతామయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులు, పండ్లు అందజేశారు. అలాగే జయభారత్ హాస్పిటల్‌లో రోగులకు పండ్లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.భాస్కర్, మిడతల రమేష్, బి.సురేష్, వి.సునీల్‌రెడ్డి, చిలకపాటి శ్రీనివాసులు, కోటేశ్వరమ్మ, శాంతమ్మ, పద్మమ్మ, ప్రసన్నమ్మ, అశోక్, రాధాకృష్ణారెడ్డి, నారాయణ, శ్యామలు పాల్గొన్నారు.

## జాతీయ యోగా పోటీలకు విశ్వసాయి విద్యార్థిని




రాష్ట్ర స్థాయిలో నెల్లూరులో జరిగిన 61వ అంతర్‌జిల్లాల యోగాసన ఛాంపియన్‌షిప్ పోటీలలో నెల్లూరుజిల్లా నుండి నెల్లూరు విశ్వసాయి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థిని కుమారి కె.ఉమామహేశ్వరి జాతీయ స్థాయిలో యోగా పోటీలకు ఎంపికైనట్లు విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మెన్ డా॥ ఎన్.సత్యనారాయణ, వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణమోహన్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. జనవరి2 నుండి 8వతేదీ వరకు ఢిల్లీలో జరగబోయే జాతీయ స్థాయి యోగా పోటీల్లో ఉమామహేశ్వరి పాల్గొననుంది. ఈ సందర్భంగా నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని విశ్వసాయి కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యాసంస్థల ఛైర్మెన్, వైస్‌ఛార్మెన్ విద్యాసంస్థల తరపున పుష్ప గుచ్ఛంతో అభినందించి జాతీయ స్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన లక్ష్మీ నరశింహశాస్త్రిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ఛైర్‌పర్సన్ రుక్మిణి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని విద్యార్థినిని అభినందించారు.

### అపోలో మదన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా

## పిఆర్‌టియు కరదీపిక విడుదల




ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ వారు రూపొందించిన హ్యాండ్‌బుక్–2016ను డిసెంబర్ 27వ తేదీన నెల్లూరులోని అపోలో ఆసుపత్రిలో ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు యం.మదన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయులకు ఎంతో ఉన్నత స్థానం వుందని, ఉత్తమ పౌరులను దేశానికి అందించే శక్తి వారికే వుందన్నారు. ప్రతి ఒక్కరికీ ఈ హ్యాండ్ బుక్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అపోలో హాస్పిటల్ తరపున ఉపాధ్యాయులకు వైద్య ఖర్చులో 20శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.వివేకానందరెడ్డి, రిటైర్డ్ డిఇఓ ఎం.రామలింగారెడ్డి, పిఆర్‌టియు నెల్లూరుజిల్లా శాఖ అధ్యక్షులు వి.కృష్ణారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నాగేంద్రకుమార్, రాజారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కె.సుధాకరరెడ్డి, దయాకరరెడ్డి, రాజయ్య, కాంతయ్య పాల్గొన్నారు.

# కష్టాల్లోనే పార్టీకి అండగా నిలుద్దాం...

## - నెల్లూరులో ఆర్భాటంగా జరిగిన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవంలో నేతలు



జిల్లాలో కాంగ్రెస్‌పార్టీకి బలమైన నాయకత్వం కరువై బలహీనవర్గాలకు చెందిన నాయకులే దిక్కైన తరుణంలో పార్టీ పరంగా ఓ పెద్ద కార్యక్రమం జరిగింది. పనబాక కృష్ణయ్య జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అయ్యాక తొలి కార్యక్రమం ఇది. పెద్ద తలలు లేకపోయినా తమ స్థాయిలో బాగానే నిర్వహించి కేడర్‌కు భవిష్యత్ మీద ఆశలు కలిగించారు.

జాతీయ కాంగ్రెస్‌పార్టీ 131వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం నెల్లూరు ఇందిరాభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పునరుజ్జీవనం కోసం ప్రతి కార్యకర్త కష్టించి పనిచేయాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించేవరకు కాంగ్రెస్‌పార్టీ పోరాటాన్ని ఆపదన్నారు. భావోద్వేగాలతో పార్టీని వీడి వెళ్లిపోయిన వారంతా పార్టీలోకి రావాలని విజ్ఞప్తి చేశారు. 2019 ఎన్నికలే టార్గెట్‌గా కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని, రాష్ట్రంలో తిరిగి కాంగ్రెస్ జెండా రెపరెపలాడాలన్నారు. తొలుత నెల్లూరు నగరంలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం సమీపంలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నుంచి ఇందిరాభవన్ వరకు కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, బైక్‌లు, కార్లలో ర్యాలీ నిర్వహించారు. ఇందిరాగాంధీ, జవహర్ లాల్‌నెహ్రూ, బిఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇందిరా భవన్‌కు చేరుకుని జెండా ఆవిష్కరించారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో పార్టీ ఖాళీ కాలేదని త్వరలోనే పార్టీకి పూర్వవైభవం వస్తుందన్నారు. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు ముందుండి నడిపించే వారిని ప్రజలు, సమాజం గుర్తుంచుకుంటుందన్నారు. కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి మాట్లాడుతూ పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు కొంతమంది నడిరోడ్డులో పార్టీని వదిలేసి వెళ్లారన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. మాజీమంత్రి శైలజానాథ్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి నిస్సిగ్గుగా ఎన్టీఆర్ ఫోటోను వాడుకుంటున్నారన్నారు. నెల్లూరులో వేసిన ప్రతి రోడ్డూ కాంగ్రెస్ హయాంలోనిదేనన్నారు. బీజేపీ హయాంలో ముస్లింలకు, చర్చిలకు రక్షణ ఉండదన్నారు. ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ ప్రజలకు దేశంలో కాంగ్రెస్‌పార్టీ ఒక్కటే న్యాయం చేస్తుందన్నారు. డీసీసీ అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య మాట్లాడుతూ 2019లో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చేందుకు గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు మాదాసు గంగాధరం, నగర అధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్‌యాదవ్, నాయకులు సి.వి. శేషారెడ్డి, చేవూరు దేవకుమార్‌రెడ్డి, చెంచల బాబుయాదవ్, రఘురామ్ ముదిరాజ్, పందిళ్లపల్లి అరుణమ్మ, కేతంరెడ్డి వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

# మంత్రిగారూ!.. మీ ఆక్రమణల సంగతేమిటి?

## - లోక్‌సత్తా సూటి ప్రశ్న



మంత్రి గారూ!.. నెల్లూరు నగరంలో మీరు ఆక్రమించిన స్థలంలో నిర్మాణాలు తొలగించండి.. తద్వారా సుందర సింహపురికి నాంది పలకండి..ముందు మీ ఆక్రమణల సంగతేమిటంటూ లోక్‌సత్తా నేతలు మంత్రి నారాయణను ఉద్దేశించి సూటిగా ప్రశ్నించారు. నెల్లూరులోని లోక్‌సత్తా జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కెన అంకయ్య చౌదరి మాట్లాడుతూ, గత నెలలో నెల్లూరు నగరం వరదనీటిలో మునిగిపోయినప్పుడు మంత్రి నారాయణ హడావిడి పర్యటనలతో ప్రజలను మభ్య పెట్టారని విమర్శించారు. వరదల సమయంలో నెల్లూరులో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎక్కడ చూసినా ఆక్రమణల వల్లే ఇలాంటి విపత్తులు వస్తున్నాయని, వెంటనే ఆ ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ముఖ్యమంత్రి ఆదేశాలిచ్చి నెలరోజులు గడుస్తున్నా ఇప్పటిదాకా ఆక్రమణల జోలికి వెళ్ళకపోవడం అనుమానాలకు తావిస్తోందని, తన సొంత కళాశాలకు సంబంధించిన ఆక్రమణలు తొలగిస్తానంటూ మంత్రి నారాయణ ఇటీవల ప్రకటించినప్పటికీ, ఆ తర్వాత ఆ విషయమే పట్టించుకోకపోవడం ఏమిటని ఆయన విమర్శించారు. ఈ సమావేశంలో ఆ పార్టీ ప్రతినిధులు సిపి బాబురావు, ఎంఎస్ మణియాదవ్, ఎల్ కృష్ణవేణి, బి.రవి, వైవి కిషోర్, రామానాయుడు పాల్గొన్నారు.

# డెయిరీలో దొంగలు పడ్డారు

నెల్లూరు వెంకటేశ్వరపురంలో ఉన్న విజయ పాల డెయిరీ కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. రూ.11,04,665లు నగదు అపహరించారు. పోలీసుల కథనం మేరకు ప్రభుత్వ సహకార రంగ సంస్థ విజయ పాల డెయిరీ కేంద్రంలోని పరిపాలనా భవనానికి రెండు వైపులా ద్వారాలు ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని దుండగులు పరిపాలనా భవనం వెనుకవైపు నుంచి తలుపులు తెరచి లోనికి ప్రవేశించారు. లాకరున్న గది తలుపులు తాళం తెరిచే వీలు లేకపోవడంతో లాకర్ ముందు భాగాన్ని కోసి తొలగించారు. అందులో రెండు అరలు వున్నాయి. వాటిలో ఒక అరలో ఉన్న రూ.11,04,665ను అపహరించుకెళ్లారు. మరో అరను తీసేందుకు వీలు లేకనో, మరో అర వుందన్న విషయం తెలియకనో రెండో అరను మాత్రం తాకకుండా దొరికిన నగదును అపహరించుకెళ్లారు. రెండో అరలో రూ.2,63,088 నగదు వుంది. 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు బ్యాంకులు సెలవుల కారణంగా డెయిరీకి వచ్చిన కలెక్షన్‌ను పరిపాలనా భవనంలోని లాకర్‌లో ఉంచారు. రోజూలాగే సోమవారం ఉదయం సిబ్బంది వచ్చి లాకర్‌ను చూడగా అది తెరచి వుంది. దీంతో సిబ్బంది దొంగలు పడి చోరీ చేశారన్న విషయాన్ని గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారులతో పాటు నెల్లూరురూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న నెల్లూరురూరల్ ఎస్సై సుబ్బారావు తమ సిబ్బంది, క్లూస్‌టీంతో సంఘటనా స్థలానికి వెళ్ళి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తెలుగు విద్యార్థి జిల్లా అధ్యక్షునిగా

# మరోసారి తిరుమలనాయుడు



టిఎన్‌ఎస్‌ఎఫ్ (తెలుగునాడు విద్యార్థి సమాఖ్య) జిల్లా అధ్యక్షునిగా కాకర్ల తిరుమల నాయుడు మరోసారి నియమితులయ్యారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర రాష్ట్రపార్టీ ఆమోదంతో ఆ మేరకు టిఎన్‌ఎస్‌ఎఫ్ కమిటీని ప్రకటించారు. ఆదివారం ఆ నియామక పత్రాలను కార్యవర్గానికి అందజేశారు. తిరుమలనాయుడును రెండవసారి అధ్యక్షునిగా నియమించగా, ప్రధాన కార్యదర్శిగా షేక్ అమృల్లాను అదే పదవిలో కొనసాగించారు. అన్ని మండలాల నుంచి ప్రాతినిధ్యం వుండేలా మొత్తం 39 మందితో టిఎన్‌ఎస్‌ఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు.


ESTD: 1944 సూటింగ్స్ - షర్టింగ్స్ - రెడీమేడ్స్

మాడరన్ స్టోర్స్

ట్రంక్‌రోడ్డు, నెల్లూరు. ఫోన్: 2326462, 6511611.

మీ ఆదరాభిమానాలతో 71 సంవత్సరములు పూర్తి చేసుకుని
72 వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంలో
మా ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు
నూతన సంవత్సర మరియు
సంక్రాంతి శుభాకాంక్షలు.



Raymond KILLER Reid & Taylor Louis Philippe The upper crest.

నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు

Mayuri Restaurant
MULTICUISINE
Pogathota, Nellore
☎ 2329601, 2349679

INDIAN
CHINESE
TANDOOR
MEALS
NELLORE DUM BIRIYANIES
ICE-CREAMS
Carry Home
For HOME DELIVERY
CALL - 2336889

We undertake OUT-DOOR CATER

Venkataramana Vilas
Padmavathi Fast Foods
High Quality Pure Vegetarian
TIFFIN, COFFEE, MEALS, ICE-CREAMS & COOL DRINKS
POGATHOTA, NELLORE. ☎ 2328659, 2349677

# గూడూరు డివిజన్ వార్తలు

## సిఆర్ రెడ్డి హాస్పిటల్ సౌజన్యంతో
# ఉచిత వైద్యశిబిరం



గిరిజనులకు వైద్యం చేస్తున్న డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణి

మనుబోలు మండలం బద్వేలు రోడ్డు సమీపంలో వున్న గుడిసంఘంలో ఉన్న 40 కుటుంబాల గిరిజనులకు డాక్టర్ సిఆర్ రెడ్డి హాస్పిటల్ సౌజన్యంతో డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణి ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దాత కొండా రమణయ్య, సిఆర్ మార్టులో వున్న ఇన్ఫ్లుయన్స్ వారు ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో గిరిజన కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, ఆంధ్ర మహిళా మండలి అధ్యక్షులు విష్ణువందన, డాక్టర్ సి.రోహిణి, ఎల్లసిరి లక్ష్మి, జీవని, ప్రభ, సుప్రభ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ క్రికెట్ పోటీలు



మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ అధ్యక్షులు తోట సురేష్ తదితరులు

ప్రతి యేడాది సంక్రాంతిని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ నిర్వహించే క్రికెట్ పోటీలకు సమాయత్తం అయ్యే క్రమంలో ముందస్తుగా వివిధ రంగాల ప్రతినిధులతో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు తోట సురేష్ సమావేశం నిర్వహించారు. పట్టణంలోని లయన్స్ క్లబ్, దాత కోట సునీల్‌కుమార్ దాతృత్వంతో వివిధ పార్టీల నాయకులు, పోలీసులు, పట్టణ ప్రముఖులతో క్రికెట్ నిర్వహణపై ఆదివారం చర్చించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి చేవూరు విజయమోహన్‌రెడ్డి, పట్టణ సిఐ సుబ్బారావు, క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ నిత్యం వివిధ పనుల్లో నిమగ్నమైన పలు రంగాలకు చెందిన వారు సోదర భావంతో పోటీల్లో పాల్గొనడం ద్వారా క్రీడా స్ఫూర్తిని చాట వచ్చన్నారు. పోటీల్లో పాల్గొనడమే ముఖ్యమని, గెలుపు ఓటములు ప్రధానం కాదని తెలిపారు. ప్రతి సంవత్సరం పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నిర్వహించే క్రమంలోనే 9, 10తేదీల్లో క్రికెట్ పోటీలు జరగనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు, క్రికెట్ కో-ఆర్డినేటర్ కడివేటి చంద్రశేఖర్, మనపాటి రవీంద్ర, గోపాలకృష్ణ యాదవ్, శివకుమార్, నవీన్, రాజేంద్రప్రసాద్, ఎస్సై జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వేస్టేషన్లో ఏడిఆర్ఎం వేణుగోపాల్



రైల్వే ఏడిఆర్ఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న వామపక్ష నాయకులు

గూడూరు రైల్వేజంక్షన్‌ను విజయవాడ రైల్వే డివిజన్ ఏడి ఆర్ఎం వేణుగోపాల్‌రావు ఆదివారం పరిశీలించారు. విజయవాడ నుంచి వచ్చిన ఆయన రైల్వేస్టేషన్‌లో పలు ప్లాట్‌ఫాంలను తనిఖీ చేశారు. రైల్వే రిజర్వేషన్, టిక్కెట్ కౌంటర్ల వద్ద, ప్రయాణీకులకు స్టేషన్‌లో అందుతున్న వసతులపై ఆరా తీశారు. అనంతరం అధికారులతో భద్రత, సౌకర్యాలపై సమీక్షించారు. నెల్లూరుకు డిఆర్ఎం వస్తున్న క్రమంలో ఆయన గూడూరులో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలోనే సిపిఐ నాయకులు ఆయన్ను కలసి మరమ్మతులకు గురైన వంతెనను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్లాట్‌ఫాం చివర మరుగుదొడ్లను నిర్మించాలంటూ వినతిపత్రం సమర్పించారు. అలాగే పలువురు గూడూరు రైల్వే జంక్షన్ విజయవాడ, తిరుపతి, చెన్నైకి మధ్యలో కీలకంగా ఉన్న క్రమంలో రైల్వే రిజర్వేషన్‌లో (ఈక్యూ) ఎమర్జన్సీ కోటా ప్రవేశపెట్టాలని కోరారు. దీనికి స్పందించిన ఆయన పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైల్వే ఎస్సైగా సుధాకర్

గూడూరు రైల్వే జంక్షన్ జిఆర్‌పి ఎస్సైగా కె.సుధాకర్ ఆదివారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఒంగోలు పట్టణంలో ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై గూడూరు రైల్వే ఎస్సైగా ఆయన నియ మితులయ్యారు. గతంలో ఉన్న వరప్రసాద్ బదిలీపై వెళ్ళగా సుమారు 7 నెలలుగా రైల్వే ఎస్సై ఇక్కడ లేరు. ఈ క్రమంలో తాజాగా సుధాకర్ విధుల్లో చేరారు. గతంలో గూడూరు - మనుబోలు మధ్య నాన్‌కేడర్ ఐపిఎస్ అధికారిణిపై దాడి, బంగారు దోపిడీ, రైల్లో చోరీల ఘటనలు న్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రయాణీకులకు భద్రత కల్పించ డంలో కీలకంగా వ్యవహరిస్తామన్నారు.

## అర్హులకు తప్పక పరిహారం

వరదల సమయంలో ఇళ్ళలోకి నీరు వచ్చి సర్వం కోల్పోయామని సోమవారం నాడు పట్టణ, గ్రామీణ ప్రాంతాల వరద బాధితులు గూడూరు తహశీల్దార్ సి.వెంకటనారాయణమ్మను కలసి విన తులు సమర్పించారు. ఇప్పటికే అధికా రులు రెండు దఫాలుగా వరద బాధితు లకు పరిహారం పంపిణీ చేశారని, కానీ నేటికీ తీవ్రంగా నష్టపోయిన తమకు న్యాయం జరగలేదని తెలిపారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ వెంకటనారాయ ణమ్మ మాట్లాడుతూ ప్రతి అర్జీని పరిశీ లించి సర్వే చేసి అర్హులైతే తప్పక పరి హారం అందిస్తామన్నారు. అనంతరం తహశీల్దార్ వరద బాధితుల ఇళ్ళను స్వయంగా పరిశీలించారు. మరోవైపు మండలంలో గత వారంలో పంపిణీ చేసిన చెక్కులు మార్చుకునేందుకు పట్టణం లోని ఎస్‌బిఐ బ్యాంకు వద్ద సోమవారం బారులు తీరారు.

# సీతారామ కల్యాణం



గూడూరు పట్టణంలోని పటేల్‌వీధిలో వున్న సాయి సత్సంగ నిలయంలో ఆదివారం శ్రీ సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. మార్గశిర పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని భద్రాచలం నుంచి తీసుకువచ్చిన శ్రీ రామచంద్రమూర్తుల ఉత్సవ విగ్రహాలకు అర్చకులు సంప్రదాయబద్ధంగా పూజలు జరిపారు. వేద వచనాలతో కార్యక్రమం సాగింది. వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన నదీ జలాలతో అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేషాగోపాల్, శర్మ, శ్రీనివాస రామానుజం, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



గత నెల 27న గ్రామీణ అభివృద్ధి సంస్థ సాయంతో చెన్నూరు గిరిజనకాలనీ ఎలిమెంటరీ స్కూలు విద్యార్థులకు 350మందికి యూనిఫాంను పంపిణీ చేస్తున్న గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తదితరులు

LIC
నెల్లూరు డివిజన్ ఎల్ఐసి అధికారులకు, గూడూరు బ్రాంచి మేనేజర్ మరియు స్టాఫ్‌కు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లకు, ఏజంటుమిత్రులకు, పాలసీదారులకు, పట్టణశ్రేయోభిలాషులకు మరియు లయన్ మిత్రులకు
2016 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.
మీ అందరి జీవితాలలో సంక్రాంతి వెలుగులు నింపాలని కోరుతూ...
మీ...
Ln. మల్లెమాల మురళీరెడ్డి
Ex-Disctrict Chairman(Insurance)
LIC Development Officer, Gudur Branch.

మా క్లయింట్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు గూడూరు ప్రాంత ప్రజానీకానికి
2016 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.
S. RAMA MOHAN RAO, B.Com., FCA
S.V. Ratnam & Co.,
Chartered Accountants
13/160, Thyagaraja Street, Gudur - 524 101,
Nellore Dist., A.P. Tel: 08624 - 52143.

మా ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, గూడూరు ప్రాంత ప్రజానీకానికి
2016 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.
వల్లంకొండ వెంకటసుబ్బయ్య
అధ్యక్షులు, చిల్లీస్ కమీషన్ మర్చెంట్స్ అసోసియేషన్
గూడూరు.

గూడూరు ప్రాంత ప్రజలకు, పేషంట్లకు, డాక్టర్లకు, మిత్రులకు, మా శ్రేయోభిలాషులకు
2016 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.
డా॥ జి.మైథిలి
యం.బి.బి.యస్. యండి., డి.జి.ఓ., ఎఫ్.ఎ.ఆర్.టి.
కాన్పులు, గర్భకోశ వ్యాధుల నిపుణులు
మైథిలి హాస్పిటల్
కూరగాయల మార్కెట్ దగ్గర, ఐ.సి.యస్.రోడ్డు, గూడూరు.
ఫోన్. 08624 - 253896.

మా ఖాతాదారులకు, మిత్రులకు మరియు శ్రేయోభిలాషులకు
2016 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు...
మీ...
Rtn. మయూరి శ్యామ్ యాదవ్
ప్రొప్రయిటర్
సెల్. 99486 06664
88855 24000
మయూరి స్వీట్స్ & బేకరి
ఎన్.టి.ఆర్. షాపింగ్ కాంప్లెక్స్, పాత బస్టాండ్, గూడూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా.
మా బ్రాంచిలు: సంగం థియేటర్ దగ్గర, హాస్పిటల్ రోడ్డు, గూడూరు | ఐ.సి.యస్.రోడ్డు, నాయుడుకాలువ కట్ట దగ్గర, గూడూరు | రమేష్‌రెడ్డి నగర్, కందుకూరి షాపింగ్‌మాల్ ఎదురుగా, పియం.ఆర్. ట్రేడ్ కాంప్లెక్స్, నెల్లూరు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, రాబడి బాగుంటుంది. పరిచయాలు, వ్యాపకాలు పెరుగుతాయి. అనుకున్న పనులు కొద్ది శ్రమతో నెరవేరతాయి. సొంత నిర్ణయాల వల్ల మేలు జరుగుతుంది. డబ్బు ప్రలోభాలకు, వత్తిడులకు ఉద్యోగులు దూరంగా ఉండండి. కొన్ని అదనపు ఖర్చులుండినా ఇబ్బంది ఉండదు. కుటుంబ సౌఖ్యం, బంధు సౌఖ్యం బాగుంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

తలపెట్టిన పనులందు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. అనవసర విషయాలలో చొరబడవద్దు. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేయండి. భాగస్వామిక చర్చలందు అభివృద్ధి ఉంటుంది. ఉద్యోగులపై అధికారుల అనుకూలత బాగుంటుంది. సమస్యలుంటే సామరస్య ధోరణిలో పోవడం మంచిది. ప్రముఖులను కలుసుకొంటారు. శుభకార్య ప్రయత్నాలు ఆలస్యం కావచ్చును.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వృత్తి ఉపాధి పథకాలలో అభివృద్ధి ఉంటుంది. ఆదాయం సంతృప్తికరం. కాని అదనపు ఖర్చులు తప్పని సరిగా ఉంటాయి. ఋణాలు చేయవలసి రావచ్చును. అనుకున్న పనులను విజయవంతం చేస్తారు. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేయండి. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత, దైవ, సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. కోర్టు కేసులందు అనుకూలత కలదు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 1.01.2016 నుండి
తేది. 7.01.2016 వరకు

ఈ వారం మీనంలో కేతువు, సింహంలో గురువు, కన్యలో రాహువు, తులలో కుజుడు, వృశ్చికంలో శని శుక్రులు, ధనుస్సులో రవి, మకరంలో బుధుడు, కన్య తుల వృశ్చికంలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 1 శుక్రవారము ఆంగ్ల సంవత్సరాది

**ముహూర్తములు**

- తేది 1 శుక్రవారము ఉదయము గంట 7.34 నుండి గంట 9.40 వరకు మకర లగ్నమున వ్యాపార వివాహములు.

**కార్తీక మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 1 | శుక్ర | సప్తమి | రా॥ గం.9.0వ॥ |
| తేది. 2 | శని | అష్టమి | రా॥ గం.11.11వ॥ |
| తేది. 3 | ఆది | నవమి | రా॥ గం.1.24వ॥ |
| తేది. 4 | సోమ | దశమి | రా॥ గం.3.33వ॥ |
| తేది. 5 | మంగళ | ఏకాదశి | రా॥ గం.5.55వ॥ |
| తేది. 6 | బుధ | ద్వాదశి | పూర్తిగ |
| తేది. 7 | గురు | త్రయోదశి | పూర్తిగ |

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఖర్చులు బాగా పెరిగిననూ ఆర్థిక లోపం ఉండదు. సభలు సమావేశాలలో పాల్గొంటారు. గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. పనులు సకాలంగా పూర్తి కాగలవు. మధ్యవర్తిత్వాలకు, హామీలకు పోవద్దు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, రాబడి పెరుగుదల ఉంటుంది. స్థిరాస్తుల క్రయవిక్రయాలను తాత్కాలికంగా ఆపడం మంచిది. విద్యా ప్రగతి కలదు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. అవసరాలను, కోరికలను వాయిదా వేయవలసి వస్తుంది. వృత్తి వ్యాపారాలలో అంతంత మాత్రమే అభివృద్ధి, ఆదాయం ఉంటుంది. ప్రముఖులను కలుసుకొంటారు. సేవా సామాజిక కార్యములందు, యూనియన్ల కార్యకలాపములందు పాల్గొంటారు. తోడ్పడవలసిన వారు మీ నుండి తప్పించుకొని తిరుగుతారు. వస్తు, వాహన గృహ రిపేర్లుంటాయి.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆర్థిక ఇబ్బందులు తప్పక ఉంటాయి. వృత్తి వ్యాపార నిర్వహణ తృప్తికరంగా ఉండదు. ఆదాయం తగ్గవచ్చును. మంచి ఆర్థికావకాశాలు చేజారవచ్చును. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. బంధువుల వల్ల సమస్యలుండవచ్చును. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు అవసరం. అధికారులకు స్థానమార్పులు, ఉద్యోగులకు పని వత్తిడి అదనపు బాధ్యతలుండగలవు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2పాదాలు

కుటుంబంలో చిన్నచిన్న విభేదాలుండినా సర్దుబాటు చేసికొనిపోక తప్పదు. రావలసిన బాకీలు నిలబడిపోతాయి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. సోదరవర్గానికి మేలు జరుగుతుంది. ఆర్థికస్థితి బాగుంటుంది. ముఖ్యపత్రాలు, డబ్బు వస్తువులు పదిలపరచుకొనండి. ఉద్యోగుల సమర్థతకు గుర్తింపు ప్రతిఫలం లభిస్తుంది. అనుకున్న పనులను నెమ్మదిగా సాధిస్తారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

మందులు, వస్త్ర, ఫ్యాన్సీ, ప్రొవిజన్స్ వ్యాపారాలు అభివృద్ధిలో ఉండి ఆదాయం పెరుగుతుంది. మిగిలిన వ్యాపారాలు సామాన్యంగా జరిగి, స్థిరాస్తులు, ఆర్థిక లావాదేవీలు వేగవంతం కాగలవు. కోర్టు కేసులు వాయిదా పడటం, ఉద్యోగ ప్రయత్నాలలో వున్న వారికి అవకాశాలుంటాయి. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. ఆరోగ్యం, కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

అన్నింటా సామర్థ్యాన్ని ప్రదర్శించి పనులను సానుకూలం చేసుకొన్నా చిన్నచిన్న పొరపాట్లు దొర్లుతాయి. కొత్త పెట్టుబడులు పెట్టడం, పెద్దమొత్తాలలో డబ్బు ఇతరులకు ఇవ్వడం చేయవద్దు. వ్యాపార రంగాల వారికి మంచి అవకాశాలు చేజారవచ్చును. ఆదాయం సామాన్యం. ఉద్యోగార్థులు వచ్చిన అవకాశాన్ని వాడుకొనండి. శుభకార్య ప్రయత్నాలు అనుకూలం కాగలవు. ఆరోగ్యం ఫరవాలేదు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఉద్యోగులకు కొత్త బాధ్యతలు గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. ఉద్యోగార్థులకు అనుకూలత ఉంది. ఖర్చులు కొంత పెరిగినా ఇబ్బందులుండవు. అనుకున్న పనులను నెరవేర్చుకొంటారు. కొంత మందిని, వారి సలహాలను పట్టించుకొనవద్దు. సొంత నిర్ణయాలు మంచిది. ప్రముఖులను కలుసుకొంటారు.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థిక పరిస్థితులు, కుటుంబ సమస్యలు చక్క బడతాయి. వృత్తి వ్యాపారాల వృద్ధికి కొత్త ప్రయత్నాలు చేస్తారు. ఆదాయం సామాన్యంగా ఉంటుంది. తొందరపాటు ప్రయత్నాల వల్ల తగాదాలు వచ్చే అవకాశం ఉన్నది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. కళా సాహిత్య శాస్త్ర సాంకేతిక క్రీడారంగాల వారికి అవకాశాలు లభించగలవు. విద్యా ప్రగతి బాగుంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అనుకున్న పనులు టెన్షన్ పెట్టినా సవ్యంగా జరుగుతాయి. సంప్రదింపులు, చర్చలు ఫలించగలవు. స్వల్ప అనారోగ్య బాధలుండినా ప్రమాదం కాదు. వాహనాలు నడిపేవారు, యంత్రాలు కరెంటు పనులు చేసేవారు జాగ్రత్తగా ఉండాలి. బిల్లుల చెల్లింపు సకాలంలో చేస్తారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధపెట్టి, వ్యాపకాలు తగ్గించుకోవాలి. శుభవార్తలు వింటారు.

# నవాజ్‌కు అరుదైన కానుకనిచ్చిన మోడీ


శ్రీను గల్పిక

అది రష్యా రాజధాని మాస్కో... భారత ప్రధాని నరేంద్ర మోడీ అప్పుడే నిద్రలేచారు. తాను బస చేసిన హోటల్ లోనే యోగాసనాలు పూర్తి చేసారు. తర్వాత తన సెల్‌ఫోన్‌లో ట్విట్టర్ ఓపెన్ చేసారు. ప్రియమైన మోడీ గారు... భారత దేశంలో మిమ్మల్ని చూసి చాలాకాలమైంది. ప్రపంచ దేశాలన్నింటిని చుట్టేస్తున్న మీరు వీలుంటే ఇండియాకు కూడా ఓసారి రాగలరు... ఇట్లు ఇండియన్స్... అని ఒక సందేశం. మోడీజీ, నేను భారతదేశ పర్యటనకు రావాలనుకుంటున్నాను, మీరెప్పుడు ఇండియాలో ఉంటారో తెలియజేస్తే నేను ఆ తేదీకి ఇండియాకొస్తాను... ఇట్లు, డేవిడ్ కామెరూన్, ఇంగ్లండ్ ప్రైమ్ మినిస్టర్ అని ఇంకో మెసేజ్. మూడో సందేశం... సార్, ఐయామ్ బాన్‌కీ మూన్, ఐక్య రాజ్యసమితి జనరల్ సెక్రటరీ... నేను ఇండియాకు రావాలనుకుంటున్నాను, కానీ మీరే ఇండియాలో ఉండడం లేదని తెలిసింది. మీరు ఇండియాలో ఎప్పుడుంటారో తెలియజేస్తే నేను ఆ తేదీకి రాగలను. తర్వాత ఇంకో మెసేజ్ కూడా వుంది. అది బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా నుండి వచ్చింది. మోడీజీ... మీరు వెంటనే ఇండియాకు రావాలి. ఇక్కడ పార్టీ కార్యక్రమాలు చాలా పెండింగ్‌లో వున్నాయి. వాటిపై చర్చించాల్సి వుంది. అలాగే ప్రభుత్వానికి సంబంధించిన పనులు కూడా ఉన్నాయి. మీరు వీలు చూసుకుని త్వరలో రాగలరని ఆశిస్తున్నాము. ఓ వారం రోజులు ఇక్కడుంటే తర్వాత ఇంకో రెండుమూడు నెలల దాకా విదేశీ పర్యటనలు చేసుకోవచ్చు అని వుంది. ఈ మెసేజ్‌లన్నీ చదవడంతో తాను ఇండియాను వదిలి చాలా రోజులైందన్న విషయం మోడీకి గుర్తొచ్చింది. ఇండియా మీదకు గాలి మళ్లింది. మాస్కోలో హోటల్‌రూం ఖాళీ చేసి విమానమెక్కాడు. అంతలో సెల్‌ఫోన్ మోగింది. మోడీ ఫోన్ ఎత్తాడు. అవతల నుండి ఆఫ్ఘనిస్థాన్ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ... మోడీ గారు, మీరు ప్రపంచంలో అన్ని దేశాలు తిరుగుతున్నారు, మా దేశాన్ని మాత్రం చిన్నచూపు చూస్తున్నారు. బ్రేక్‌ఫాస్ట్‌కు ఇక్కడకు రాకూడదా అని కోరాడు. ఇండియాకు వెళ్లే దారే కదా... వచ్చేస్తాను అని మోడీ చెప్పి ఫోన్ పెట్టేసాడు. రష్యా ప్రధాని పుతిన్ వీడ్కోలు పలకడంతో మోడీ ఎక్కిన విమానం గాల్లోకి లేచింది.

★★★★★

ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కబూల్... కాందహార్ ఎయిర్‌పోర్టులో అష్రఫ్ ఘనీ స్వయంగా మోడీకి ఆహ్వానం పలికాడు. మోడీ ఎయిర్‌పోర్టును చుట్టూ చూడసాగాడు. ఎందుకలా చూస్తున్నారని అష్రఫ్ అడిగాడు. ఇంతకుముందు ఉగ్రవాదులు మా విమానాన్ని హైజాక్ చేసి దించింది ఇక్కడే కదా... ఆ సంఘటన గుర్తొచ్చి చూస్తున్నానని మోడీ చెప్పాడు. తర్వాత ఇద్దరు అధ్యక్ష భవనంకు చేరుకున్నారు. మోడీకి శాఖాహార వంటకాలతో అల్పాహారం విందు ఇచ్చారు. ఇరు దేశాల వ్యాపార, రక్షణ సంబంధాలపై మోడీ, అష్రఫ్‌లు మాట్లాడుకున్నారు. మోడీ బయల్దేరడానికి లేచాడు. అష్రఫ్ వుండి... మీకు వీలున్నప్పుడల్లా మా దేశానికి వస్తుండండి అని కోరాడు. అందుకు మోడీ... ఈ రూటులో వెళ్లేటప్పుడల్లా టిఫిన్‌కో, భోజనానికో దిగుతుంటాలే అని చెప్పాడు. తర్వాత మోడీ కారెక్కి ఎయిర్ పోర్టుకు బయల్దేరాడు. దారిలోనే ఫోన్ తీసి ఫేస్‌బుక్ ఓపెన్ చేసాడు. 'ఈరోజు పాకిస్థాన్ ప్రధాని నవాజ్‌షరీఫ్ బర్త్‌డే' అనే మెసేజ్ వచ్చింది. వెంటనే నవాజ్ షరీఫ్‌కు మోడీ ఫోన్ చేసి విషెస్ చెప్పాడు. షరీఫ్ థ్యాంక్స్ చెప్పి... ఒట్టి ఫోన్‌లో విష్ చేస్తే ఏం లాభం, మీరు ఇక్కడకు రండి, సెలబ్రేట్ చేసుకుందామన్నాడు. మోడీ అందుకు సరేననడంతో కాబుల్ నుండి బయలుదేరిన విమానం ఇస్లామాబాద్‌లో దిగింది. నవాజ్‌షరీఫ్ ఎయిర్‌పోర్టుకు వచ్చి మోడీని రిసీవ్ చేసుకున్నాడు. కుశల ప్రశ్నలు అయ్యాక ఇద్దరూ షరీఫ్ ఇంటికి చేరుకున్నారు. అక్కడ షరీఫ్ తల్లి కనిపించగానే మోడీ ఆమె కాళ్లకు దండం పెట్టాడు. ఆమె మోడీని ఆశీర్వదించింది. ఇక్కడ సంఘటన చూసి నవాజ్ షరీఫ్... నేను కూడా ప్రతీకారం తీర్చుకుంటానన్నాడు. ఇప్పుడు నేనేం తప్పుచేసాను, అమ్మ కాళ్లకు దండం పెట్టానని మోడీ అన్నాడు. నేను కూడా అదే చెబుతున్నాను. ఇండియాకు వచ్చినప్పుడు నేను కూడా మీ తల్లికి పాదాభివందనం చేస్తాను... అని షరీఫ్ చెప్పాడు. మోడీ అందుకు... చంపావ్‌పో... ప్రతీకారం అంటే మళ్లీ ఉగ్రవాదులనేమన్నా పంపిస్తావనుకున్నా... మనమిద్దరం ఇంత స్నేహంగా వున్నాం కదా, మనం కలిసిపోయినట్లే మన రెండు దేశాలు కలిసి మెలిసి వుంటే ఎంత బాగుంటుందని మోడీ అన్నాడు. అందుకు నవాజ్‌షరీఫ్... నిజమే కదా, పిట్ట పోరు పిట్ట పోరు నడుమ పిల్లి లాభపడ్డట్లు... మన ఇరు దేశాల మధ్య వున్న శతృత్వాన్ని సాకుగా తీసుకుని అమెరికా, చైనాలు మనతో ఆయుధాల వ్యాపారం చేస్తున్నాయి. మనం శత్రువులుగా వుండడం కంటే మిత్రులం కావడం మేలు. ఏం చేయాలో చెప్పండన్నాడు. పరస్పరం ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఉంటే మన ఇరు దేశాల మధ్య స్నేహం పెరుగుతుందని చెప్పాడు మోడీ. అదెలా అని షరీఫ్ అడిగాడు. అప్పుడు మోడీ చెప్పసాగాడు. మా దగ్గర వంకాయలున్నాయి, మీ దగ్గర లేవనుకోండి... మేం వాటిని మీకు పంపిస్తాం. మీ దగ్గర టెంకాయలున్నాయి, మా దగ్గర లేవనుకోండి... వాటిని మీరు మాకు పంపించాలన్న మాట. మీ దగ్గర వున్నవి మా దగ్గర లేకున్నా, మా దగ్గర వున్నవి మీ దగ్గర లేకున్నా ఒకరికొకరం అడ్జస్ట్ చేసుకుంటుంటే... స్నేహం అక్కడే బలపడుతుందని మోడీ చెప్పాడు. దానికి షరీఫ్... ఇప్పుడు నాకు బాగా అర్థమైంది. మన స్నేహం బలపడాలంటే కొన్ని త్యాగాలు చేయాలి. మీ స్నేహం కోసం నేనేం త్యాగం చేయాలని అడిగాడు. అందుకు మోడీ... కాశ్మీర్‌పై ఆశలను త్యాగం చేయాలి, అక్కడ ఉగ్రవాద కుట్రలను త్యాగం చేయాలని అన్నాడు. షరీఫ్ అందుకు... సరే దీనికి ప్రతిఫలంగా నేనొకటి అడుగుతాను, కాదనకూడదు అని కండీషన్ పెట్టాడు. మోడీ ఓకే అన్నాడు. మా దగ్గర లేనివి మీ దగ్గర వుంటే ఇస్తామన్నారు... మీ దేశంలోని ఐఆర్20-420 నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలు మా పాకిస్థాన్‌లో లేవు. కాబట్టి ఓ నాలుగు టన్నులు ఆ దోమలను ఇవ్వండి చాలు... కాశ్మీర్ ఊసెత్తం అని చెప్పాడు. ఆ మాటతో మోడీ ఆలోచనల్లో పడిపోయాడు. ఈ దోమలు ఉగ్రవాదుల చేతుల్లో పడితే వాళ్లు జీవాయుధాలను తయారు చేసి ప్రపంచం మీదకు వదిలే అవకాశముంది, ప్రపంచ వినాశనానికే అది దారి తీయొచ్చు... అని మనసులో అనుకుంటూ ఉగ్రవాదుల చేతికి దోమలు అందించబోమని మీరు హామీ ఇస్తేనే వాటిని మీకిస్తామని మోడీ కండీషన్ పెట్టాడు. అందుకు షరీఫ్ మా దేశంలో ఉగ్రవాద శిబిరాల మీద దాడులకే మీ దోమలను కోరుతున్నాం. ఇది మాకొచ్చిన ఆలోచన కాదు, అమెరికా అధ్యక్షుడు ఒబామా ఇచ్చిన సలహా. దయచేసి మా కోరికను మన్నించండని నవాజ్ అడిగాడు. ఉగ్రవాదులపై దాడులకైతే నాలుగు టన్నులేం ఖర్మ నలభై టన్నులు పంపిస్తానంటూ మోడీ ఇండియాకు బయల్దేరాడు.

# కార్పొరేషన్ పనులపై శ్వేతపత్రం విడుదల చేయగలరా?



- ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు కార్పొరేషన్‌వారు నెల్లూరు నగరంలో ఇప్పటివరకు ఏమేమి పనులు చేశారనే విషయమై సమగ్రంగా ఒక శ్వేతపత్రం విడుదల చేయగలరా?.. ఆ ధైర్యం వారికి వుందా?.. అంటూ నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ సూటిగా ప్రశ్నించారు. బుధవారం ఆయన నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలో వున్న 11వ డివిజన్‌లోని ఎన్టీఆర్ నగర్, పల్లిపాళెం తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను కలసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నగరంలో ఎక్కడ చూసినా చెత్త అలాగే వుందని, కాలువల్లో చెత్తను తొలగించాలని, పూడిక తీయించాలని వారు అనుకోవడం లేదని, పనులకు టెండర్లు పిలచి ఆరునెలలు పూర్తవుతున్నా కాలయాపన చేస్తున్నారే తప్ప పనులు జరగడం లేదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శానిటేషన్ సిబ్బందిని 250 మందిని తీసుకున్నామని చెప్తున్నారని, అయితే అలాంటి దాఖలాలేమీ కన్పించడం లేదని ఆయన విమర్శించారు. ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా కార్పొరేషన్‌వారు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వార్డులలో స్థానిక కార్పొరేటర్‌ల సహకారంతో జన్మభూమి కమిటీలను వేసి అర్హులైనవారికి పింఛన్లు ఇప్పించే బాధ్యత కమిషనర్‌దేనని, అయితే ఇవేమీ చేయకుండా అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడం విచారకరమని ఆయన విమర్శించారు. పనులు చేయడంలో కమిషనర్ పూర్తిగా విఫలమయ్యారని, మంత్రి నారాయణ చెప్పిన పనులు మాత్రం చేస్తున్నట్లు చెప్పుకుంటున్నారని, ఇంత దారుణమైన కమిషనర్‌ను ఇంత వరకు చూడలేదని అందరూ అంటున్నారని ఆయన అన్నారు. ఎన్టీఆర్ నగర్‌లో రోడ్లు ఎన్నో ఏళ్ళుగా గుంతలతో నిండివున్నా కనీసం గ్రావెల్‌రోడ్లు వేసే పరిస్థితి కూడా లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, దేవరకొండ అశోక్, వైఎస్సార్సీపి జిల్లా కార్యదర్శి లోకిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, మునీర్ సిద్ధిక్, వి.శ్రీనివాసులురెడ్డి, బి.హరిప్రసాద్‌నాయుడు, ఉప్పాల శేషుగౌడ్, గోతం బాలకృష్ణ, చల్లా వెంకటరావు, కె.నారాయణ, దామవరపు చంద్రమోహన్, కోటి, సిహెచ్ నాగరాజు, జనార్ధన్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పల్స్‌పోలియోను జయప్రదం చేయండి




జనవరి 17 నుంచి 19వ తేది వరకు జిల్లాలో జరుగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జేసీ రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన తన ఛేంబర్‌లో పల్స్‌పోలియో కార్యక్రమంపై జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 0–5 సంవత్సరాల పిల్లలను 3,29,000 మందిని గుర్తించారని, వారందరికీ పల్స్‌పోలియో చుక్కలు వేసేందుకు జిల్లావ్యాప్తంగా 3088 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు. జనవరి 2 నుంచి జరుగనున్న జన్మభూమి కార్యక్రమంలో పల్స్‌పోలియో గురించి ప్రచారం కల్పించాలన్నారు. మారుమూల ప్రాంతాలు, మైనింగ్ ప్రాంతాలు, వలస వచ్చిన వారి పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి ఆ పిల్లలందరికీ పల్స్‌పోలియో చుక్కలు వేయాలని సంబంధిత సిబ్బందిని, అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ టి. వెంకటలక్ష్మి, ఆస్పత్రుల జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ సుబ్బారావు, ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రతినిధి డాక్టర్ నాయక్, ఇమ్యూనిటీ అధికారి డాక్టర్ జయసింహ, సిడిపిఓ సత్యకుమారి, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ, ఇవిఎస్ నాయుడు, కె.వి సుబ్బారెడ్డి, కె.ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సెంథిల్‌పై ఫిర్యాదు

సోమవారం నెల్లూరు వచ్చిన గుంటూరు రేంజ్ ఐజి ఎన్.సంజయ్‌ను జిల్లా పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు గంగాధర్, జిల్లా అధ్యక్షులు ఎం.ప్రసాదరావు, కార్యదర్శి జగన్మోహన్‌రావులు కలిసారు. ఈ జిల్లాలో సెంథిల్‌కుమార్ ఎస్పీగా పని చేసినప్పుడు సిబ్బంది చేసిన చిన్నచిన్న తప్పులకు శాఖా పరంగా తీవ్రమైన చర్యలు తీసుకున్నారని, ఇలాంటి వారందరినీ ఒకే వేదికపైకి తెచ్చి తీవ్రత తగ్గించాలని కోరారు. అలాగే శిక్షణ పూర్తి చేసుకున్న 2012బ్యాచ్‌కు చెందిన 42మంది ఎస్‌ఐలకు 'ఏ' జాబితా మంజూరు చేయాలని కోరారు.

# కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

- బిజెపి నేత కందుకూరి సత్యనారాయణ

## కావలి కబుర్లు

ప్రధాని నరేంద్రమోడీ సారధ్యంలో కేంద్రప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలను చేపడుతోందని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కందుకూరి సత్యనారాయణ అన్నారు. ఇటీవల ఆయన కావలిలో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి, కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన పలు పథకాలను వివరించారు. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న గ్యాస్ కనెక్షన్లపై సబ్సిడీ ప్రతి పేద కుటుంబానికీ ఒక వరం అని ఆయన అన్నారు. కావలి, ఉదయగిరి నియోజకవర్గాలకు 3020 గ్యాస్ కనెక్షన్లు కొత్తగా మంజూరయ్యాయన్నారు. వీటిలో కావలికి 541, అల్లూరుకు 559, బోగోలుకు 290, దగదర్తికి 796, జలదంకికి 610, కలిగిరికి 61, కొండాపురానికి 163 కనెక్షన్లు మంజూరైవున్నాయన్నారు. అదేవిధంగా, ప్రధాని ఆవాజ్ యోజన పథకం ద్వారా కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి 1,94,000 ఇళ్ళు మంజూరు చేసిందన్నారు. ఇందులో నెల్లూరుజిల్లాకు 20,681 ఇళ్ళు మంజూరు కాగా, వీటిలో నెల్లూరు నగరానికి 10,040, గూడూరుకు 5,103, కావలికి 4,510, ఆత్మకూరుకు 1,028 ఇళ్లు మంజూరయ్యాయని వివరించారు. ఈ పథకం ద్వారా పేదవానికి సొంతింటి కల నెరవేరనుందన్నారు. ఇకపోతే, కేంద్రం అందిస్తోన్న ముద్రా యోజన పథకం వ్యాపారస్తులకు ఒక వరంగా మారిందని, ఈ పథకం ద్వారా వ్యాపారాభివృద్ధికి తగు రుణాలు లభిస్తాయని అన్నారు. చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు కూడా ఎంతో ప్రోత్సాహం అందుతోందని, ఇలాంటి పథకాలను అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## బాబుది ప్రజాపాలన

రాష్ట్రంలో చంద్రబాబు ప్రజా సంక్షేమ పాలన జరుగుతోందని తెలుగుదేశంపార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆత్మకూరు బ్రహ్మయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు అరాచక పాలన సాగిస్తున్నారని అసెంబ్లీలో వైకాపా సభ్యులు ఆరోపించడాన్ని ఆయన తన ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.






## శ్రీకాళహస్తి న్యూస్

# చెన్నై వరద బాధితులకు 'అమ్మ' చేయూత





తొట్టంబేడు మండలంలోని శివనాథపురంలో వున్న 'అమ్మ' అనాథ మహిళా వృద్ధాశ్రమం నుంచి ఇటీవల చెన్నై వరద బాధితుల సహాయార్థం కొంత సామగ్రి, చీరలు, చిన్నపిల్లల దుస్తులు వగైరాలు పంపారు. కనీసం రెండు వందల మందికి వీటిని పంపిణీ చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బిజెపి నాయకుడు కోలా ఆనంద్ మాట్లాడుతూ, బాధితులైన నిరుపేదలకు తమవంతు సాయం అందించడం ఎంతో అభినందనీయమన్నారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు పి.భూలక్ష్మి, పి.సరోజిని, పిఆర్ సరస్వతమ్మలు మాట్లాడుతూ, చెన్నైవాసులకు వరద మూలంగా జరిగిన భారీ నష్టాలను కళ్ళారా చూసి ఎంతో బాధ పడ్డామన్నారు. అందువల్ల తమకు చేతనైనంతమేరకు బాధితులకు సహాయం అందిస్తున్నామన్నారు. చెన్నైలోని వ్యాసాడిపాడి కాలనీలో బాధితులకు తమ సాయం అందజేశామన్నారు. వీరితో పాటు ఈ సహాయ కార్యక్రమాల్లో శ్రీమతి రేవతి, సివి జయంతి, పి.యాసిన్, అర్జునయ్య, మోహన్‌రెడ్డి, రాజ, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఐడిబిఐ బ్యాంక్ రుణాలు

శ్రీకాళహస్తిలోని ఐడిబిఐ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం చిట్టత్తూరు గ్రామంలో రైతు దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా బ్యాంక్ బ్రాంచ్‌మేనేజర్ ఎస్.విశాల్ మాట్లాడుతూ, శ్రీకాళహస్తిలో ఏడాది క్రితం ఈ బ్యాంక్ బ్రాంచ్‌ను ఏర్పాటుచేశామని, రైతులకు రుణాలు అందిస్తూ ఈ బ్యాంక్ ఎంతో చేయూతనిస్తోందని అన్నారు. ఎబిఎం వెంకటేశ్వర్లు, దిలీప్ మాట్లాడుతూ, రుణాలు తీసుకున్న రైతులు తిరిగి రుణాలు చెల్లిస్తే మరింత మంది రైతులకు రుణాలిచ్చే అవకాశం వుంటుందన్నారు. అయిదెకరాల మామిడి చెట్ల పెంపకానికి, అరటి చెట్ల పెంపకానికి కూడా రుణసదుపాయం కల్గిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది గిరి, భాను, చంద్రయ్య, సోమశేఖర్, శ్రీధర్‌ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణ వైభవం...!



నెల్లూరు రూరల్ దేవరపాళెంలోని దొడ్ల డెయిరీలో హెడ్‌ప్రొడక్షన్ బాధ్యతలు నిర్వహిస్తున్న దుగనపల్లి ప్రభాకర్‌రెడ్డి - వాణిల కుమారుడు **సుధీర్‌రెడ్డి - సాయిదివ్య** (కడప జిల్లా వందాడి గ్రామ వాస్తవ్యులు చింతం వెంకట శివారెడ్డి - నీరజల కుమార్తెల వివాహం డిసెంబర్ 16వ తేదీ తిరుపతిలోని పిఎల్‌ఆర్ గార్డెన్స్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.



నెల్లూరు ట్రంకురోడ్డులోని సాయిబాబా మందిరం కమిటి సభ్యులు కొల్లి శ్యామసుందరరెడ్డి - నళినిల కుమారుడు **శ్రీహర్ష - నవనీత** (కడప జిల్లా మిద్దెల గ్రామ వాస్తవ్యులు బుసిరెడ్డి నారాయణరెడ్డి - శివశంకరమ్మల కుమార్తెల పరిణయం డిసెంబర్ 23వ తేదీ తిరుపతిలోని మేడా రఘునాధరెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లోను, రిసెప్షన్ 25వ తేదీ నెల్లూరు అనిల్ గార్డెన్స్‌లోను జరిగాయి. కొత్తజంటకు 'లాయర్' శుభాకాంక్షలు.



మురళీకృష్ణ హోటల్స్ వ్యవస్థాపకులు గ్రోసు గోపాలయ్య సమీప బంధువు నారు సుధాకర్ - ప్రభావతిల కుమారుడు **భరత్‌కుమార్ - నిరూప** (కీ॥శే॥ కొర్రపాటి నాగేశ్వరరావు - సుశీలల కుమార్తెల కల్యాణం డిసెంబర్ 20వ తేదీ నెల్లూరు మైపాడురోడ్డులోని డిజిపి కల్యాణ మండపంలో జరిగింది. నవదంపతులకు 'లాయర్' శుభదీవెనలు.



నెల్లూరులోని పోస్టల్ కాలనీ వాస్తవ్యులు రాజారమేష్‌బాబు - శ్రీలక్ష్మిల కుమారుడు **అనిల్‌కుమార్ - సుజిత చైతన్య** (కర్నూలు వాస్తవ్యులు మంచికంటి శ్రీనివాసులు - పద్మావతిల కుమార్తెల పెళ్ళి డిసెంబర్ 23వ తేదీ కర్నూలులోని తనిష్క్ కన్వెన్షన్ హాల్ నందు జరిగింది. నూతనదంపతులకు 'లాయర్' శుభాభినందనలు.

# నేత్రపర్వంగా అయ్యప్పస్వామి నగరోత్సవం



నెల్లూరు వేదాయపాళెంలో వేంచేసియున్న స్వామి అయ్యప్ప దేవస్థానంలో జరుగుతున్న మండల పూజోత్సవంలో భాగంగా సోమవారం అయ్యప్పగుడి నగరోత్సవం నేత్రపర్వంగా సాగింది. శ్రీ స్వామి అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం కేరళ సాంప్రదాయ రీతిలో విశేషపూజలు, అభిషేకాలు జరిగాయి. సాయంత్రం నెల్లూరు నవాబుపేట శివాలయం నుంచి నగరోత్సవం ప్రారంభమై వేదాయపాలెంలోని స్వామి అయ్యప్ప దేవస్థానం వరకు సాగింది. దారి పొడవునా కేరళ సంప్రదాయ రీతిలో మంగళవాద్యాల నడుమ, భజనలు, అయ్యప్ప నామస్మరణలతో సింహపురి నగర వీధులు మారుమ్రోగాయి. వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన పల్లకీలో స్వామివారు విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారికి దీప హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, రాజేశ్వరమ్మ దంపతులు వ్యవహరించారు. శ్రీ స్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష కార్యదర్శులు పిటి రంగరాజన్, జి.శేషగిరిరావు, ఉపాధ్యక్షులు అబ్బు స్వామి, కె.సూర్యనారాయణరెడ్డి, సహాయకార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి విజయకుమార్, సభ్యులు చలపతిస్వామి, బాలు స్వామి, చంద్రస్వామి తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.

# 3న బ్రాహ్మణ చైతన్య సదస్సు

సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అణగారిపోతున్న బ్రాహ్మణ జాతిని ఏకత్రాటిపైకి తెచ్చి చైతన్యవంతులను చేయాలనే సంకల్పంతో మంత్రాలయ రాఘవేంద్రస్వామి పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థ స్వామి అనుగ్రహ, ఆశీస్సులతో జనవరి 3వ తేదీన మంత్రాలయంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య వారి ఆధ్వర్యంలో బ్రాహ్మణ చైతన్య సదస్సు జరుగుతుందని సమాఖ్య ఉపాధ్యక్షులు స్వయంపాకుల శ్రీనివాసులు కోరారు. ఈ సమావేశంలో ఆధ్యాత్మిక, ధర్మప్రవచకులు, సినీ, రాజకీయ రంగ ప్రముఖులు పాల్గొని బ్రాహ్మణ జాతి అభ్యున్నతికి సూచనలు సలహాలు ఇస్తారన్నారు. రాష్ట్రంలోని బ్రాహ్మణ బంధువులు వేలాది సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. నెల్లూరుజిల్లా నుండి రాదలచినవారు స్వయంపాకుల శ్రీనివాసులు(7893605229), ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్(9848486599), గుడ్లదొన వాసుదేవరావు(9878709424)లను సంప్రదించాలన్నారు.

# ఆంధ్రుల రాత మారుతుంది!

(మొదటి పేజీ తరువాయి)

కనీసం ప్రత్యేకహోదా ఇస్తే రాష్ట్రానికి పట్టిన అరిష్టం కొంతన్నా వదులుతుందనుకుంటే, చంద్రబాబు దాని కోసం చిన్న ప్రయత్నం కూడా చేయడం లేదు. సరే, ప్రభుత్వం ఇంత అవినీతికరంగా వుంది... కనీసం దానిని అదిలించే ప్రతిపక్షమన్నా గట్టిగా వుందా... అంటే అదీ లేదు. అధికార పక్షానికి ఏ మాత్రం తీసిపోనట్లుగా ప్రతిపక్షం వుంది. ప్రజా సమస్యల విషయంలో ప్రభుత్వంపై ఎదురుదాడికి రెండే వేదికలు. ఒకటి చట్ట సభలో, రెండోది ప్రజా సభలో. చట్ట సభలలో ప్రజా సమస్యలపై చర్చించే రోజులు పోయాయి. సభ్యులు తన్నుకోవడానికే టైం సరిపోవడం లేదు. ఇక ప్రజాసమస్యలపై మాట్లాడే తీరిక వాళ్లకు ఎక్కడుంది. ప్రతిపక్ష నేతగా జగన్ ప్రజల్లోకి పోవాలి. ప్రజాసభలలోనే ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి. కాని ప్రతిపక్ష నేతలో అంతటి చొరవ కనిపించడం లేదు. గతంలో ప్రతిపక్ష నేతగా దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను అటు చట్ట సభలలోనూ, ఇటు ప్రజా సభలలోనూ ఎండగట్టేవాడు. కాబట్టే అప్పుడు చంద్రబాబు ఒళ్లు దగ్గరపెట్టుకుని పని చేశాడు. ఇప్పుడు జగన్ అంటే లెక్కలేనితనం అయ్యిందాయనకు. కాబట్టి తాను అనుకున్నవి అడ్డదిడ్డంగా చేసుకుపోతున్నాడు. ఆయన అక్రమాలను అడ్డుకోవాల్సిన ప్రతిపక్షనేత ఆ విషయంలో దూకుడు చూపలేకపోతున్నాడు.

చంద్రబాబు అడ్డగోలు వ్యవహారాలు, జగన్ అడ్డుకోలేని వైఖరితో రాష్ట్రానికి తీరని నష్టం జరుగుతోంది. ఇద్దరు నేతలు కూడా తమ పంథా మార్చుకోకపోతే 2016లో కూడా రాష్ట్రంలో కష్టాలు, కన్నీళ్ళు తప్పవు.




# కొత్త సంవత్సరం... కొత్త ఆశలు

***2015 సంవత్సరం... జిల్లాకు ఏమంత బాగా లేదనే చెప్పుకోవాలి. ఒక్క 2015 కాదు, 2010 నుండి కూడా ఏ సంవత్సరం బాగా లేదు. వై.యస్. మరణానంతరం రాష్ట్రంలో పరిస్థితులు ఆ విధంగా తగలబడడంతో నెల్లూరుజిల్లా మీద ఆ ప్రభావం పడింది.***





**• కొన్నేళ్ళుగా స్థబ్ధుగా వ్యాపారాలు**

**• గందరగోళంగా ఆర్థిక పరిస్థితులు**

వై.యస్ హయాంలో నెల్లూరుజిల్లా ఓ వెలుగు వెలిగింది. ఈ జిల్లా పారిశ్రామిక హబ్‌గా రూపాంతరం చెందడానికి పునాది పడింది వై.యస్. హయాంలోనే! వ్యవసాయం, వ్యాపారం, రియల్ ఎస్టేట్, వాణిజ్యం, పరిశ్రమలు... ఇలా అన్ని రంగాలు ఆరోజు మంచి ఊపు మీదున్నాయి. వై.యస్. మరణం తర్వాత జిల్లాలో ఆ ఊపు తగ్గిపోయింది. 2010లో రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోయింది. ఆ పడిపోవడం పడిపోవడం ఇక లేవలేదు. ఇప్పటికి ఆరేళ్లయ్యింది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు చాలామంది దివాళా తీసారు. కొందరు ఐపిలు పెట్టారు. రియల్ ఎస్టేట్ మీద ఆధారపడ్డ ఇతర వ్యాపారాలలో కూడా మందకొడితనం కనిపిస్తోంది. 2005 నుండి 2009 మధ్యలో ఒక్క నెల్లూరులోనే దాదాపు పదికిపైగా కొత్త హోటళ్లు నిర్మిస్తే, 2009లో వై.యస్. మరణం తర్వాత ఇప్పటివరకు ఒక్కటంటే ఒక్కటి కొత్త హోటల్ రాలేదు. దీనిని బట్టే జిల్లాలో పరిస్థితి ఎంత దారుణంగా వుందో అర్థం చేసుకోవచ్చు.

2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వం రావడంతో స్వతహాగానే జనం ఆశలు పెరిగాయి. జిల్లాకు చెందిన యం.వెంకయ్యనాయుడు కేంద్రంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కావడం, పి.నారాయణ రాష్ట్రంలో మున్సిపల్ శాఖ మంత్రి కావడం జరిగింది. వీళ్లిద్దరూ తమ జిల్లా మీద అభిమానంతో పెద్దఎత్తున నిధులు తెచ్చి అభివృద్ధి పనులు చేస్తారని కూడా భావించారు. అయితే వీరిద్దరి నుండి ఆశించిన స్థాయి ఫలితాలు రావడం లేదు. కొంతలో కొంత వెంకయ్యనాయుడన్నా బెటర్... పట్టుబట్టి నెల్లూరును స్మార్ట్ సిటీ జాబితాలోనన్నా చేర్చాడు. నారాయణ అయితే అది కూడా లేదు. ఆయన మంత్రి అయ్యాక నా జిల్లాకు నేను ఈ పని చేసానని చెప్పుకోవడానికి ఒక్క పని కూడా లేదు. అర్థరాత్రి పర్యటనలు, ఆకస్మిక హడావిడి, అధికారులను హైరానా పెట్టడం తప్ప ఆయన చేసిందేమీ లేదు. ఆయన నెల్లూరుజిల్లా కంటే అమరావతి రాజధాని మంత్రిగానే ఎక్కువుగా గుర్తింపు పొందారు. మొన్న వరదల సమయంలో నెల్లూరు నగరంలో వున్న ఆక్రమణలన్నింటిని తీసేస్తామని శపథం చేసారు. ఇప్పుడు ఆ శపథాన్ని మరిచిపోయారు. 2015లో జిల్లా పరంగా పెద్దగా అభివృద్ధి కార్యక్రమాలు లేవు. ప్రజలు అన్ని విధాలుగా ఇబ్బందులు పడ్డారు. చాలామందికి పనులు కూడా లేవు.

కనీసం 2016లో అయినా ఈ పరిస్థితుల్లో కొంచెం మార్పులు వస్తాయని, జిల్లాకు కొన్నన్నా అభివృద్ధి ప్రాజెక్టులు వస్తే అన్ని రకాలుగా వ్యాపారాలు పుంజుకుంటాయని అందరూ గంపెడాశతో వున్నారు.








## పంచమ వర్ధంతి

పూజ్యులు, మా ఇంటి దైవం
మా పురోభివృద్ధికి ముఖ్యకారకులు, "మిత్రబంధు"

**శ్రీ నారపరెడ్డి కోదండరామరెడ్డి, M.A. గారు**
(మైపాడు వాస్తవ్యులు)

స్వర్గస్తులై తేది 05-01-2016 నాటికి
ఐదు సంవత్సరాలు నిండనున్న సందర్భంగా

ఆయన దివ్యస్మృతిని స్మరించుకుంటూ
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

**శ్రీమతి నారపరెడ్డి సులోచనమ్మ** - భార్య

కుమారులు - కోడళ్ళు

**డాక్టర్. ఎన్.విష్ణుస్వరూప్‌రెడ్డి** - **డాక్టర్. శాంతి**
ఇ.ఎన్.టి & ఫేషియల్ ప్లాస్టిక్ సర్జన్, కేర్ హాస్పిటల్, బంజారాహిల్స్, హైదరాబాద్. - ఒబేస్ట్రిషియన్ & గైనకాలజిస్ట్ అపోలో హాస్పిటల్, జూబ్లీహిల్స్, హైదరాబాద్.

**ఎన్.వినోద్‌రెడ్డి** - **శాలిని**
ఛైర్మెన్ & ఎం.డి., సిఆర్ఎంఐటి గ్రూప్, బెంగుళూరు. - డైరెక్టర్, సిఆర్ఎంఐటి గ్రూప్, బెంగుళూరు.

కుమార్తెలు - అల్లుళ్ళు

**జి.సుప్రియ** - **జి.విజయసింహారెడ్డి**
డైరెక్టర్, ఫార్ట్యూన్ ఇండియా బిల్డర్స్, బెంగుళూరు.

**ఎన్.పద్మప్రియ** - **ఎన్.చంద్రారెడ్డి**
ఛైర్మెన్ & ఎం.డి., ఫార్ట్యూన్ ఇండియా బిల్డర్స్, బెంగుళూరు.

మనుమలు, మనుమరాండ్రు
**జి.అభిషేక్‌రెడ్డి**, సిఆర్ఎంఐటి (డైరెక్టర్, ఆస్ట్రేలియా), **వైష్ణవి**
**జి.అనుదీప్, రాహిల్, రుషిల్ సాకేత్, విషాల్, మేఘన, హర్ష, సంజన, వినూష**
మునిమనుమరాలు - **అమైర**


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com